ఈఎంటీ ఉద్యోగ అవకాశం

నవ తెలంగాణ-బొమ్మలరామారం

మండలంలోని 108 నూతన వాహనంపై అత్యవసర సేవలందించడానికి ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు నుంచి దరఖాస్తులు స్వీకరించినట్టు. జిల్లా మేనేజర్ మండ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎంటీ ఉద్యోగానికి సైన్స్ గ్రూపులో డిగ్రీ, డిప్లమా ఇన్ ఈఎంటి, బీఎస్సీ, బైపిసి, ఎస్ ఎస్ సి, పూర్తిచేసి ఏఎన్ఎం, చేసి ఎస్సెస్సీ పూర్తి చేసి ల్యాబ్ టెక్నీషియన్ చేసిన 30 ఏండ్ల లోపు వారి అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ట్రైనింగ్ 45 రోజులు ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 22న భువనగిరి జిల్లా ఆస్పత్రి 108 కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాటు,ఒక సెట్ జిరాక్స్ తీసుకురావాలని వివరాలకు 9985226582,80089355 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

పోషకాఆహార లోపం నివారణ పై అవగాహన కల్పించాలి

నవతెలంగాణ- భువనగిరిరూరల్

పిల్లలలో పోషకాహార లోపం నివారణపై తల్లులకు అవగాహన కల్పించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి మహిళా శిశు సంక్షేమ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో ఆయన సమీక్షిస్తూ జిల్లాలోని ప్రతి అంగన్వాడీ కేంద్రం యొక్క హాజరు, నిర్వహణ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని, శాఖాపరమైన సేవలలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి అన్నపూర్ణ, సిడిపిఓలు, సూపర్వైజర్లు, జిల్లా మహిళా సాధికారత సిబ్బంది, చైల్డ్ లైన్ సిబ్బంది, పోషన్ అభియాన్ సిబ్బంది, జిల్లా సిబ్బంది పాల్గొన్నారు

మార్పుల్లేవ్..చేర్పుల్లేవ్

సీట్లన్నీ సిట్టింగ్‌లకే..

- ఉమ్మడి జిల్లాలో 12 స్థానాలు ఖరారు..
- ఉత్కంఠకు తెర దించిన సీఎం కేసీఆర్
- ఆశావాహులకు షాకిచ్చిన అధిష్టానం..



బీఆర్ఎస్ అసెంబ్లీ టికెట్లపై కొంతమంది గంపెడాశలు పెట్టుకున్నారు. ఈసారి ఏలాగైనా అధిష్టానం తమకే టికెట్ కేటాయిస్తుందంటూ ప్రచారం చేసుకున్నారు. దీనికితోడు ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా 5 స్థానాల్లో అభ్యర్థుల మార్పు ఖాయమంటూ రాజకీయవర్గాల్లో పెద్దఎత్తున చర్చ జరిగింది. కానీ ఎవ్వరూ ఊహించని విధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలకు బీఆర్ఎస్ అధిష్టానం అభ్యర్థులను ఖరారు చేసింది. సదరు స్థానాలన్నీంటిని సిట్టింగ్‌లకే కట్టబెట్టి అందరినీ ఆశ్చర్యపరిచిందనే చెప్పాలి.నిజానికి ఉమ్మడి జిల్లాలో మొదటి విడత కేవలం 7 స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటిస్తారనే ఊహగానాలు విన్పించాయి. కానీ అలాంటి ఊహగానాలకు చెక్ పెడుతూ 12 నియోజకవర్గాలకు 12 అభ్యర్థులను కేటాయించడం గమనార్హం.

నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి:

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అందులో నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గానికి కంచర్ల భూపాల్ రెడ్డి, నకిరేకల్‌కు చిరుమర్తి లింగయ్య, మునుగోడు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, దేవరకొండకు రమావత్ రవీంద్రకుమార్, నాగార్జునసాగర్‌కు నోముల భగత్, మిర్యాలగూడకు నల్లమోతు భాస్కర్‌రావు, సూర్యాపేటకు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, కోదాడకు బొల్లం మల్లయ్యయాదవ్, హుజూర్‌నగర్‌కు శానంపూడి సైదిరెడ్డి, తుంగతుర్తికి గాదరి కిశోర్ కుమార్, ఆలేరుకు గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, భువనగిరికి పైళ్ల శేఖర్ రెడ్డిల అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది.

ఆశావాహులకు చుక్కెదురు

ఈసారి ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేసేందుకు ఆయా నియోజకవర్గాల్లో ఆశావాహుల జాబితా చాంతడంత పెరిగిపోయింది. దాదాపుగా ప్రతి నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి కన్పించింది. టికెట్ దక్కించుకోవడం కోసం ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మరంగా చేశారు. ప్రధానంగా మునుగోడు, నల్లగొండ, నాగార్జునసాగర్, కోదాడ, నకిరేకల్, ఆలేరు నియోజకవర్గాల్లో టికెట్ కోసం సొంత పార్టీ నేతల మధ్యే పోటీ తారాస్థాయికి చేరింది. చాలామంది నేతలు టికెట్ తమకే దక్కుతుందనే ఉద్దేశంతో భారీగా ఖర్చు చేసిన దాఖలాలు లేకపోలేదు. కానీ పార్టీ అధిష్టానం ఎవ్వరూ ఊహించని విధంగా సిట్టింగ్‌లకే టికెట్లు కట్టబెట్టడంతో ఆశావాహులందరికీ చుక్కెదురయ్యింది.

రెబెల్స్ బెడదను తట్టుకోవడమేలా..?

సీఎం కేసీఆర్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ టికెట్లను ఏకచక్రాధిపత్యంగా ప్రకటించడం బాగానే ఉంది. కానీ ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో గ్రూప్ వార్ తీవ్రస్థాయికి చేరుకుంది. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేలతో పొసగక.. సొంత పార్టీ నేతలే గ్రూప్ రాజకీయాలకు తెరలేపడం.. ఆ వార్‌తో నియోజకవర్గాలు అట్టుడుకుతున్న సంగతి తెలిసిందే.ఇలాంటి పరిస్థితుల్లో రెబెల్స్‌గా నిలిచిన నేతలంతా పార్టీ ఖరారు చేసిన ఎమ్మెల్యే అభ్యర్థులకు సహకరిస్తారా.? లేక హ్యాండిస్తారా..? అన్న చర్చ లేకపోలేదు. నేటి వరకు బాహాబాహీకి దిగిన లీడర్లు ఎన్నికల్లో మనస్ఫూర్తిగా కలిసి పనిచేస్తారా..? లేక మరేదైనా పార్టీలోకి జంప్ చేస్తారా..? అన్న సవాలక్ష ప్రశ్నలు క్యాడర్‌ను గందరగోళంలోకి నెట్టేస్తున్నాయి.

అవకాశవాదులకు ప్రజలే బుద్ధి చెబుతారు

- అవినీతిపరులను ఓడించాలి
- నేడు హైదరాబాదులో ఉభయ కమ్యూనిస్టు పార్టీల సమావేశం
- లౌకిక పార్టీలతో కలిసి పని చేస్తాం
- విలేకరుల సమావేశంలో జూలకంటి

నవతెలంగాణ-మిర్యాలగూడ



అవకాశవాదులకు ప్రజలే బుద్ధి చెప్తారని, అహంకారవాదులకు, అవినీతిపరులను వచ్చే ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మునుగోడు ఎన్నికల్లో కమ్యూనిస్టుల అవసరం ఉందని కేసీఆర్ వామపక్షాల సహాయం తీసుకున్నారని, అక్కడ గెలుపొందాక ఇప్పుడు వచ్చే ఎన్నికల్లో వామపక్షాలను విస్మరించడం సరైనది కాదన్నారు. భవిష్యత్తులో వామపక్షాలతో కలిసి ఉంటామని చెప్పిన కేసీఆర్ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఏకపక్షంగా అభ్యర్థులను ప్రకటించడం అతని అవకాశావాదానికి నిదర్శనమని పేర్కొన్నారు. వామపక్ష పార్టీలకు ఓటు సీట్లు ముఖ్యం కాదని ప్రజా సమస్యల పరిష్కారమే పోరాటాలే మార్గమని చెప్పారు. మాటకు కట్టుబడి ఉండకుండా కమిట్మెంట్ లేకుండా అవకాశవాదంగా కేసీఆర్ వ్యవహరించడం ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. నేడు హైదరాబాదులో ఉభయ కమ్యూనిస్టు పార్టీల ముఖ్య నేతలు సమావేశం జరిపి కేంద్ర కమిటీ అభిప్రాయాల మేరకు ఒక నిర్ణయానికి వస్తామని తెలిపారు. కలిసి వచ్చే లౌకిక పార్టీలతో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. చట్టసభలో వామపక్షాల ప్రాతినిధ్యం అవసరమని ప్రజలు కోరుకుంటున్నారని, దానికి అనుగుణంగానే వామపక్షాలు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే విషయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రజా పోరాటం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కేసీఆర్ వ్యవహార శైలిపై కమ్యూనిస్టు పార్టీ నాయకులు కార్యకర్తలు నిరుత్సాహ, బాధ అవసరం లేదని చెప్పారు. అవకాశవాద పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మూడవత్ రవినాయక్, డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, భవాండ్ల పాండు, పరుశు రాములు, వరలక్ష్మి, నాగేంద్ర ప్రసాద్, పల్లా బిక్షం, వెంకట్‌రెడ్డి, రామారావు, బాబునాయక్, పాపారావు, కోటిరెడ్డి, పథాని శ్రీను, హరి బాబు, ఏసు, పాషా తదితరులు పాల్గొన్నారు.



అట్టహాసంగా ప్రారంభమైన సీఎంఆర్ షాపింగ్ మాల్

- జ్యోతి ప్రజ్వలన చేసిన మంత్రి జగదీశ్‌రెడ్డి
- సందడి చేసిన సినీ నటి మృణాల్‌ఠాకూర్
- భారీగా తరలివచ్చిన అభిమానులు

నవతెలంగాణ-సూర్యాపేట



వస్త్ర ప్రపంచంలో రారాజుగా పేరుగాంచిన సీఎంఆర్ 23వ షాపింగ్ మాల్ అంగరంగవైభవంగా ప్రారంభమైంది. సోమవారం జిల్లాకేంద్రంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, సినీ నటి సీతారామ ఫెమ్ మృణాల్‌ఠాకూర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా వేద పండితులను ఆశీర్వచనాలతో సన్నాయి మదంగంతో ఆహుతులకు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ స్థాయిలో పట్టణంలో సీఎంఆర్ వారు షాపింగ్ మాల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు సరసమైన ధరల్లో వస్త్రాలు అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని కోరారు. సీఎంఆర్ అధినేత మా ఊరు వెంకటరమణ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి వస్త్ర సౌరంభం సూర్యాపేటలో లభిస్తుందని తెలిపారు. ప్రజలు తమకు కావలసిన అన్ని రకాల వేడుకలకు సీఎంఆర్ తగువిధంగా అన్ని మోడల్స్ లో కుటుంబం అంతటికి నచ్చే విధంగా వస్త్రాలు అందించడం సీఎంఆర్ ప్రత్యేకత అన్నారు. సినీనటి మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ సీఎంఆర్ 23వ షోరూం మరింత దినదినాభివృద్ధి చెందాలని ఆకాక్షించారు.అదేవిధంగా షాపింగ్ మాల్ వినియోగదారుల అభిమానాన్ని చూరగొంటుందనే నమ్మకం సీఎంఆర్ కల్పిస్తుందన్నారు. ప్రతివారికి సరసమైన ధరలలో అన్ని రకాల వస్త్రాలు సీఎంఆర్‌లో లభిస్తున్నాయని పేర్కొన్నారు. సీఎంఆర్‌ను ఆదరించి ప్రజలు షాపింగ్‌ను కుటుంబ సమేతంగా చేయాలని కోరారు. అందరికీ అందుబాటులో ఉన్న ధరలు సీఎంఆర్‌లో లభిస్తాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మృణాల్ షాపింగ్ మాల్‌లో అన్ని ఫ్లోర్లు కలియ తిరుగుతూ సందడి చేశారు. అనంతరం ప్రజలను, వినియోగదారులను, అభిమానులను తన హావభావాలతో ఆకట్టుకున్నారు. ఆమెను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. దీంతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ కు చెందిన ఫణి, భాను, రమణమూర్తి ,జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు కొండపల్లి నిఖిల దిలీప్‌రెడ్డి, జ్యోతి, కర్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

లక్కీడ్రా ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు

- కలెక్టర్ నేతృత్వంలో కొనసాగిన ప్రక్రియ
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా కొనసాగిన లక్కీడ్రా

నవతెలంగాణ - భువనగిరి

నూతన మద్యం పాలసీ 2023-25 సంవత్సరాల కాలపరిమితితో కూడిన లైసెన్సుల జారీ కోసం సోమవారం భువనగిరి పట్టణంలోని స్థానిక సోమ రాధాకృష్ణ ఫంక్షన్ హాలులో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాల కేటాయింపునకు లక్కీ డ్రా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి నేతృత్వంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా సాఫీగా ఈ ప్రక్రియ కొనసాగింది. నూతన ఎక్సయిజ్ పాలసీ నియమ, నిబంధనలను అనుసరిస్తూ ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 82 మద్యం షాపులకు గాను 3969 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఒక్కో షాపు వారీగా దాఖలైన దరఖాస్తులకు సంబంధించిన వారిని వేదిక పైకి ఆహ్వానించారు. వారి సమక్షంలో జిల్లా కలెక్టర్ లక్కీ డ్రా తీస్తూ మద్యం దుకాణాల కేటాయింపును ఖరారు చేశారు. లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్ లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా డ్రా నిర్వహించారు. ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా లక్కీ డ్రా ప్రక్రియను ఆద్యంతం ఫొటో, వీడియో చిత్రీకరణ జరిపించారు. పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు హాజరు కావడంతో టోకెన్ కలిగి ఉన్న వారినే లోనికి అనుమతించారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ కుమార్ ఈ సందర్భంగా తెలియచేస్తూ.. ద్వారా సెలక్ట్ అయిన అభ్యర్దులు రేపటి లోగా 22. ఆగస్టు.2023 వ తేదీ లోగా చెల్లించాలన్నారు. లైసెన్స్ ఫీజులో 6 వ వంతు తప్పనిసరిగా చెల్లించాలని, లేనిచో వారికి 5 లక్షల రూపాయలు ఫైన్ వేయబడుతుందని, అలాగే వారిని తొలగించి మరల డ్రా నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్ చంద్ర, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



బారులు తీరిన కార్లు

నూతన ఎక్సైజ్ పాలసీలో డ్రాలో పాల్గొనడానికి పెద్ద ఎత్తున కార్లలో సోమా రాధాకృష్ణ ఫంక్షన్ హాల్ కు చేరుకున్నాయి . కార్ల పార్కింగ్కు ఇబ్బందులు ఎదురయ్యాయి దీంతో సర్వే వద్ద ట్రాఫిక్ అంతరాయం కలిగింది. సుమారు అర కిలోమీటర్ కార్ల పార్కింగ్ చేశారు వివిధ సిండికేట్ గ్రూపుల వాళ్ళు సంబంధిత వ్యక్తులని ఫంక్షన్ హాల్ దగ్గరకు పంపించి హైవే మీద ఉన్న హెూటల్లో బస చేశారు. వైన్స్ షాప్ లో వచ్చిన ఆనందంలో కొందరు వైన్ షాపు రాలేదన్న బాధలో మరికొందరు మద్యం తాగారు. బార్లు వైన్స్ లు కిటకిటలాడాయి.

డివైడర్ మీదుగా వెళ్లి బైకును ఢీకొన్న ట్రావెలర్ బస్సు

- ఇద్దరు అక్కడికక్కడే మృతి, ఒకరి పరిస్థితి విషమం
- టైరు పేలుడు ప్రమాదానికి కారణం

నవతెలంగాణ-వేములపల్లి



టైరు పేలి అదుపు తప్పిన ట్రావెలర్ బస్సు డివైడర్ మీదుగా వెళ్లి బైకును ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన సోమవారం మండలంలోని అన్నపురెడ్డిగూడెం సమీపంలో అద్దంకి నార్కట్‌పల్లి రహదారిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గుంటూరు నుండి హైదరాబాదు వెళుతున్న ప్రయివేట్ ట్రావెల్ బస్సు మండలంలోని అన్నపురెడ్డిగూడెం క్రాస్ రోడ్డు వద్దకు రాగానే టైర్ పేలింది. దీంతో అదుపుతప్పిన బస్సు డివైడర్ మీదుగా దూసుకెళ్లి నల్గొండ నుండి మిర్యాలగూడ వైపు వస్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. బైక్‌పై ప్రయాణిస్తున్న రాదేశ్యం రాత్రే(38), రత్లవత్ మంగ్య(40), అక్కడికక్కడే మృతి చెందారు. రాత్రే ఛతీస్‌ఘడ్‌కు చెందినవాడు కాగ మంగ్య వనపర్తి జిల్లాకు చెందినవాడు. వీరితో పాటు మరొక వ్యక్తి గణపతి తీవ్ర గాయాలు పాలవడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ఉన్నారని పోలీసులు తెలిపారు. వారిలో నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయన్నారు. బస్సు డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్సును అదుపులో ఉంచడంతో బస్సులో ఉన్న వారికి ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. బైకును ఢీకొన్న బస్సు పొలంలోకి దూసుకెళ్లింది. సంఘటన స్థలాన్ని ఎస్సై విజయ్‌కుమార్, సిఐ సత్యనారాయణ సందర్శించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వారు తెలిపారు.

జిల్లా ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురణ

- ముసాయిదా ఓటర్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపండి
- కలెక్టర్ కర్ణన్

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



ముసాయిదా ఓటర్ జాబితాను జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో తన ఛాంబర్‌లో విడుదల చేశారు. ముసాయిదా ఓటర్ జాబితాను పోలింగ్ స్టేషన్ లు,తహశీల్దార్ కార్యాలయం లు,ఆర్డిఓ కార్యాలయం,జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ప్రదర్శించనున్నారు. కాగా నేడు నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయనున్నారు. జారీచేసిన ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలపాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జున సాగర్, నకిరేకల్, మును గోడ్ ఆరు నియోజక వర్గాలలో మొత్తం పురుషులు,మహిళలు,థర్డ్ జెండర్ 1384585 మంది ఓటర్ లు ఉండగా 543 సర్వీస్ ఓటర్ల,13,55,482 జనరల్ ఓటర్ల ముసాయిదాను సిద్ధం చేసి ప్రచురించడం జరిగిందని, ముసాయిదాను పరిశీలించి ఓటరుగా ఇప్పటి వరకు గుర్తించబడని, తప్పొప్పుల సవరణ, లిస్టులో ఉన్నటు వంటి పేర్లపై ఆక్షేపనలు, అభ్యంతరాలను తెలపడానికి అగస్టు 21 నుండి సెప్టెంబర్ 19 వరకు గడువు ఇవ్వడం జరుగుతుందని, వచ్చిన అక్షేపణ లను విచారణ చేసి సెప్టెంబర్ 28న ఆక్షేపణలు, అభ్యంతరాలను తొలగించడం జరుగుతుందని తెలిపారు. ఎలక్షన్ కమీషన్ అనుమతిని పొంది, అక్టోబర్ 4న తుది జాబితాను ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. సోమవారం జారీ చేసిన ముసాయిదా ఓటరు జాబితాను చూసుకోని కొత్త ఓటరు నమోదు కొరకు ఫారం-6, తప్పొప్పుల సవరణకు ఫారం-8, ఓటర్ల జాబితాలోని పేర్లపై ఆక్షేపనలు, వలస పోయిన, చనిపోయిన వారు వారి వివరాలు తెలపడానికి ఫారం-7 ను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు నర్సిరెడ్డి, పిచ్చయ్య, అశోక్, సైదులు, దాసోజు యాదగిరి చారి,మల్లికార్జున్, కుతూ బుద్దిన్,ఎన్నికల డి.టి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి తహసీల్దార్‌గా దివ్యరెడ్డి

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

కొండమల్లేపల్లి నూతన తాసిల్దారుగా గంగాపురం దివ్యరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ తహసీల్దారుగా పనిచేసినటువంటి మహేందర్‌రెడ్డి సూర్యాపేట జిల్లాకు బదిలీపై వెళ్లగా వారి స్థానంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో డిప్యూటీ తహసీల్దారుగా పనిచేసిన దివ్యరెడ్డి ప్రమోషన్‌పై కొండమల్లేపల్లి మండల తాసిల్దార్ గా వచ్చి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కొండమల్లేపల్లి డిప్యూటీ తాసిల్దార్ ప్రశాంత్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ మున్సిపల్ కేంద్రంలో మెయిన్ రోడ్డు విస్తరణ పనులను స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు ప్రయాణికులకు, స్థానికులకు ఇబ్బందులు లేకుండా త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



నవతెలంగాణ
నల్లగొండ
2
మంగళవారం 22 ఆగస్టు 2023

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

• అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో పలు శాఖలకు సంబంధించిన 80 దరఖాస్తులు అందాయి. ప్రజల సమస్యలు పరిష్కారం చేసి సంబంధిత సమాచారాన్ని జిల్లా కలెక్టర్‌కు పంపించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్దండుల జిల్లాగా నల్లగొండ ఖ్యాతి

• ఈ సారి ఎవరిదో..?

నవతెలంగాణ-పెద్దవూర



ఆరు దశాబ్దాల ఎన్నికల రాజకీయ చరిత్రలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆదిలో కమ్యూనిస్టుల ఖిల్లాగా, అనంతరం కాంగ్రెస్ కంచుకోటగా నిలిచి.. ప్రస్తుతం మొత్తం 12 అసెంబ్లీ స్థానాల్లోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్రాతినిధ్యంతో గులాబీ కోటగా మారిన వైనం.. జిల్లా ప్రజల రాజకీయ చైతన్యానికి, కాలానుగుణంగా మారుతూ వస్తున్న ప్రజా తీర్పునకు నిదర్శనంగా నిలిచింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గతంలో జరిగిన నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పిదప ప్రస్తుతం సూర్యాపేట, భువనగిరి, నల్లగొండ, మునుగోడు, కోదాడ, హుజూర్ నగర్ , నాగార్జునసాగర్, మిర్యాలగూడ, ఆలేరు, తుంగతుర్తి (ఎస్సీ), నకిరేకల్ (ఎస్సీ), దేవరకొండ (ఎస్టీ) నియోజకవర్గాలున్నాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించిన జిల్లా నేతలందరూ చట్టసభల్లోనూ, రాష్ట్ర రాజకీయాల్లోనూ తమదైన ముద్ర వేశారు. 1952లో తెలంగాణ సాయుధ పోరాట నేత రావి నారాయణరెడ్డి నల్లగొండ ఎంపీగా ఆనాటి ప్రధాని నెహ్రూ కంటే అధిక మెజారిటీతో విజయం సాధించడంతో పాటు, భువనగిరి నుండి ఎమ్మెల్యేగా కూడా గెలుపొందారు. ఆరుట్ల రామచంద్రారెడ్డి-కమలాదేవి దంపతులు 1962లో భువనగిరి, ఆలేరుల నుండి ఒకేసారి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. కమలాదేవి ఆలేరులో 1952, 1957, 1962 ఎన్నికల్లో వరుసగా హ్యాట్రిక్ విజయాలు సాధించారు. రామన్నపేటలో ఇదే రీతిలో కమ్యూనిస్టు నేత కే.రామచంద్రారెడ్డి సైతం హ్యాట్రిక్ విజయాలు సాధించారు. తదుపరి ఇదే స్థానంలో సీపీఐ ఎమ్మెల్యేగా గుర్రం యాదగిరిరెడ్డి హ్యాట్రిక్ విజయాలు సాధించారు. కాంగ్రెస్ నుండి తిప్పన చిన్న కృష్ణారెడ్డి, చలకుర్తిలో నిమ్మల రాములు హ్యాట్రిక్ విజయాలు సాధించారు.

హ్యాట్రిక్ ఎమ్మెల్యేలు

హ్యాట్రిక్ విజేతలలో కుందూరు జానారెడ్డి ఐదు సార్లు చలకుర్తిలో, రెండుసార్లు నాగార్జునసాగర్‌లో విజయాలు సాధించారు. దేవరకొండలో సీపీఐ నేత బద్దు చౌహాన్, మునుగోడులో ఉజ్జిని నారాయణరావులు హ్యాట్రిక్ విజయాలు సాధించారు. హ్యాట్రిక్ విజేతలైన ఎలిమినేటి మాధవరెడ్డి భువనగిరిలో వరుసగా నాలుగు విజయాలు, ఎలిమినేటి ఉమా మాధవరెడ్డి ఉపఎన్నికతో కలిపి వరుసగా మూడు విజయాలు, ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్‌లో వరుసగా మూడు సార్లు, కోదాడలో రెండు సార్లు గెలుపొందారు. ఆర్.దామోదర్‌రెడ్డి తుంగతుర్తి నుండి నాలుగు సార్లు, సూర్యాపేట నుండి ఒకసారి గెలిచారు. మోత్కుపల్లి నరసింహులు ఆలేరులో వరుసగా ఐదు విజయాలు, ఇంకోసారి తుంగతుర్తిలో మొత్తం ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. సీపీఐ(ఎం) నేత నర్రా రాఘవరెడ్డి నకిరేకల్‌లో వరుసగా ఐదు విజయాలతో మొత్తం ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయాలు సాధించి చరిత సృష్టించారు.

మంత్రి వర్గంగా పనిచేసిన ఎమ్మెల్యేలు

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఒకసారి చిన్న కొండూరు నియోజకవర్గంలో, రెండుసార్లు భువనగిరిలో విజయం సాధించి, దామోదరం సంజీవయ్య, కాసు మంత్రివర్గాల్లో పనిచేశారు. తెలంగాణ సాధన కోసం మంత్రి పదవి త్యాగం చేశారు. పాత హుజూర్‌నగర్‌లో రెండుసార్లు గెలిచిన అక్కిరాజు వాసుదేవరావు సైతం కాసు, పీవీ మంత్రివర్గాల్లో పనిచేశారు. ఎలిమినేటి మాధవరెడ్డి ఎన్టీఆర్, చంద్రబాబు క్యాబినెట్లలో పనిచేసి నక్సలైట్ల దాడిలో హతులయ్యారు. మోత్కుపల్లి నరసింహులు ఎన్టీఆర్ మంత్రివర్గంలో పనిచేశారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి వైయస్సార్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి క్యాబినెట్లో పనిచేశారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి కూడా కిరణ్ కుమార్‌రెడ్డి క్యాబినెట్లో పనిచేశారు. రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో అత్యధికంగా 16 సంవత్సరాల నాలుగు నెలల 19 రోజులపాటు కే.జానారెడ్డి మంత్రిగా పనిచేశారు. ఆయన టిడిపి, కాంగ్రెస్ ప్రభుత్వాలలో మంత్రిగా వ్యవహరించారు. కాంగ్రెస్ నుండి పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి కూడా భవనం వెంకట్రామిరెడ్డి కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. రామన్నపేట నియోజకవర్గం నుండి గెలిచిన కొమ్ము పాపయ్య టీ.అంజయ్య మంత్రివర్గంలో పనిచేయగా, కాంగ్రెస్ నేత ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి సైతం కాసు బ్రహ్మానందరెడ్డి, జలగం వెంగళరావు మంత్రివర్గాల్లో పనిచేశారు. సీపీఐ, సీపీఐ(ఎం) దిగ్గజనేతలు బీ. ధర్మభిక్షం నకిరేకల్, నల్లగొండ, సూర్యాపేటలో ఎమ్మెల్యేగా గెలిచారు. ఈయన రెండుసార్లు లోక్ సభకు కూడా ప్రాతినిధ్యం వహించారు.

అసెంబ్లీ నుంచి పార్లమెంటుకి

సీపీఐ(ఎం) నేతలు భీంరెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యంలు, కాంగ్రెస్ నేతలు వడ్డేపల్లి కాశీరాం రెండు సార్లు అసెంబ్లీకి, ఒక సారి పార్లమెంట్‌కు, చకిలం శ్రీనివాసరావు మూడూ సార్లు అసెంబ్లీకి, ఒకసారి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. టిఆర్ఎస్ నుండి 2014, 2018 ఎన్నికల్లో విజయం సాధించిన సూర్యాపేట ఎమ్మెల్యే జీ.జగదీశ్‌రెడ్డి కేసిఆర్ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లోను కమ్యూనిస్టుల కాంగ్రెస్‌ల ముఖాముఖి

పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండ, భువనగిరి(పాత మిర్యాలగూడ) పార్లమెంటు నియోజకవర్గాలలో 1952 నుంచి జరుగుతూ వస్తున్న ఎన్నికల్లో కమ్యూనిస్టులకు, కాంగ్రెస్ పార్టీకి మధ్య గెలుపు ఓటములు మారుతూ వచ్చాయి. నల్లగొండ లోక్ సభ స్థానంలో వామపక్షాలు ఏడు పర్యాయాలు, కాంగ్రెస్ ఏడు పర్యాయాలు గెలిచాయి. తెలంగాణ ప్రజా సమితి ఒకసారి, టిడిపి రెండుసార్లు గెలిచింది. నల్గొండ ఎంపీగా రెండుసార్లు నెగ్గిన వారిలో రావి నారాయణరెడ్డి, దర్మభిక్షం, సురవరం సుధాకర్ రెడ్డిలు, మూడు పర్యాయాలు సుఖేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

అత్యధికంగా నల్లగొండ పార్లమెంట్‌కు 682 మంది నామినేషన్లతో సంచలనం

1996 పార్లమెంటు ఎన్నికల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా ఫ్లోరోసిస్ సమస్య పరిష్కారానికి డిమాండ్ చేస్తూ కృష్ణానది జలాలను శ్రీశైలం సొరంగం ప్రాజెక్టు ద్వారా జిల్లాకు తరలించాలని కోరుతూ జల సాధన సమితి, ఫ్లోరైడ్ విముక్తి పోరాట సమితి ఆధ్వర్యంలో నల్గొండ పార్లమెంటు స్థానంలో 682 మంది నామినేషన్లు దాఖలు చేసి సంచలనం సృష్టించారు. వాటిలో 201 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, 401 నామినేషన్లు ఆమోదించబడ్డాయి. దీంతో దేశ ఎన్నికల చరిత్రలో అతి పెద్ద బ్యాలెట్ పేపర్ తో పోలింగ్ నిర్వహించడం విశేషం.

లోక్ సభ ఎన్నికలో..

భువనగిరి లోక్ సభ స్థానంలో 1962 నుండి 15 సార్లు ఎన్నికలవ్వగా పదిసార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు కమ్యూనిస్టులు, ఒకసారి టిఆర్ఎస్ గెలుపొందింది. పాత మిర్యాలగూడ(భువనగిరి) స్థానంలో కాంగ్రెస్ నుండి జీఎస్.రెడ్డి, బద్దం నరసింహారెడ్డిలు మూడు పర్యాయాల చొప్పున, సూదిని జైపాల్‌రెడ్డి రెండు పర్యాయాలు, భీంరెడ్డి నరసింహారెడ్డి రెండు పర్యాయాలు గెలుపొందారు.

ప్రస్తుతం జిల్లాలో రాజకీయంగా బలహీనపడి ఉనికి కోసం పోరాడుతున్న కమ్యూనిస్టులు పార్లమెంట్ స్థానాల్లోనూ సొంతంగా గెలిచే పరిస్థితి లేకుండా పోయింది. ప్రస్తుతం రెండు పార్లమెంటు స్థానాల్లోనూ కాంగ్రెస్ ఎంపీలుగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ఈసారి టీఆర్ఎస్ పై ప్రజలు విశ్వాసం కోల్పోయారు. నిరుద్యోగ సమస్య, డబల్ బెడ్ రూములు, దళితులకు మూడేకరాల భూమి, కొందరు మంత్రులు, ఎంఎల్‌ఏలు అవినీతి కుంభాకోనాలో, దళిత బందులో అక్రమాలు ఫీజు రియాంబర్స్ మెంట్, ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడం వంటి సమస్యలతో ప్రస్తుతం బీఆర్ఎస్ కొట్టుమిట్టాడుతుంది. దీంతో కాంగ్రెస్‌కు గ్రాఫ్ పెరిగింది. ఈ నేపథ్యంలో ఈసారి జిల్లాలో ఏపార్టీ అధిక స్థానాలు సాధిస్తుందో తెలియాలంటే కొంతకాలం ఆగాల్సిందే..

లక్కీడ్రా ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు

• కలెక్టర్ నేతృత్వంలో కొనసాగిన ప్రక్రియ

• పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు

• ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా కొనసాగిన లక్కీడ్రా

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



నూతన మద్యం పాలసీ 2023-2025 సంవత్సరాల కాలపరిమితితో కూడిన లైసెన్సుల జారీ కోసం సోమవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మి గార్డెన్‌లో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాల కేటాయింపునకు లక్కీ డ్రా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ నేతృత్వంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా సాఫీగా ఈ ప్రక్రియ కొనసాగింది. నూతన ఎక్సయిజ్ పాలసీ నియమ, నిబంధనలను అనుసరిస్తూ ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 155 మద్యం షాపులకుగాను మొత్తం 7,057 దరఖాస్తులు దాఖలయ్యాయి. అత్యధికంగా దర్వేశిపురం మద్యం దుకాణానికి ఏకంగా 187 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో షాపు వారీగా దాఖలైన దరఖాస్తులకు సంబంధించిన వారిని వేదిక పైకి ఆహ్వానిస్తూ, వారి సమక్షంలో జిల్లా కలెక్టర్ కర్ణన్ లక్కీ డ్రా తీస్తూ మద్యం దుకాణాల కేటాయింపును ఖరారు చేశారు. లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్‌లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా డ్రా నిర్వహించారు. ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా లక్కీ డ్రా ప్రక్రియను ఆద్యంతం ఫొటో, వీడియో చిత్రీకరణ జరిపించారు. పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు హాజరు కావడంతో టోకెన్ కలిగి ఉన్న వారినే లోనికి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా లక్ష్మి గార్డెన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోనూ కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. లక్కీ డ్రాలో అదృష్టం వరించి వైన్ షాపులు కేటాయించబడిన వారు నిబంధనలను అనుసరిస్తూ, లైసెన్స్ ఫీజు రూపేణా నిర్ణీత రుసుము చెల్లించేందుకు వీలుగా వేదిక పైన అవసరమైన ఏర్పాట్లు కల్పించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎక్సైజ్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బీ.సంతోష్, అధికారుల పర్యవేక్షణలో మద్యం దుకాణాల కేటాయింపు లక్కీ డ్రా ప్రశాంతంగా ముగిసింది.

కదం తొక్కిన విద్యార్థి లోకం

• సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్

• ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థుల కలెక్టరేట్ ముట్టడి

• పోలీసులు విద్యార్థుల మధ్య తోపులాట

• ఎస్ఎఫ్ఐ నాయకులు అరెస్టు

• స్కాలర్ షిప్‌లు విడుదల చేయమంటే అరెస్టు లా

• సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం

• ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, టీచర్ల అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి లోకం కదం తొక్కారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన విద్యార్థులతో కలెక్టరేట్ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలనే నినాదంతో ప్రాంగణమంతా మారు మ్రోగింది. అయితే శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసే ప్రయత్నం చేయగా పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. ఇదే క్రమంలో విద్యార్థులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకు వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని అడ్డుకొని ఈడ్చుకు వెళ్లి ప్రత్యేక పోలీసు వాహనంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి, జిల్లా కార్యదర్శి కంభంపాటి శంకర్, వారితో పాటు మరికొంతమంది విద్యార్థి నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య, సంక్షేమమే తమ ధ్యేయంగా ప్రకటించింది. అధికారంలోకి వచ్చి నేటికి 9 సంవత్సరాలు పూర్తి అవుతున్న సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కారం చేసిన పరిస్థితి లేదని, కనీసం వారి బాధలను పట్టించుకోవడం లేదన్నారు. రోజురోజుకు నిత్యావసర ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. విద్యార్థులకు మేస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంలో విఫలమయ్యారన్నారని ఆరోపించారు. పెంచిన చార్జీలను విడుదల చేయడంలోనూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. నాణ్యమైన భోజనం లేక రాష్ట్రంలో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ 5,117 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్న వాటిని విడుదల చేయకుండా విద్యార్థులను చదువులకు దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారం చేయకపోతే భవిష్యత్తులో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. కలెక్టరేట్ ముందు శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించడం సరైనది కాదన్నారు. అరెస్టు చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, రేణుక, కోర్ర సైదానాయక్, రమావత్ లక్ష్మణ్, కోరె రమేష్, రవిందర్, మూడవత్ జగన్, జగదీశ్, వీరన్న, వదూద్, సమ్మద్, సంపత్, రవి యశ్వంత్, నిశ్వంత్, ప్రశాంత్, లోకేష్, శ్రీకాంత్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో నిత్యావసర వస్తువులు అందించాలి

• సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ



రేషన్ దుకాణాలలో అన్ని రకాల నిత్యవసర వస్తువులను ప్రభుత్వం అందించాలని సీఐటీయూ జిల్లా సహయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అన్ని రకాల నిత్యవసర వస్తువులు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారని దీనివల్ల పేద ప్రజలు బయట మార్కెట్లో నిత్యవసర వస్తువులు కొనుగోలు చేయలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. ప్రతి కుటుంబానికి అవసరమైన నిత్యవసర వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీపై అందించి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. రేషన్ డీలర్లకు కమిషన్ పద్ధతిన కాకుండా నెలవారి వేతనం కనీసం 30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు రేషన్ డీలర్లకు వర్తింపచేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) నాయకులు బంటు రామారావు, దిరవత్ రవినాయక్, ఎండీ.పాషా, కే. లింగయ్య, కాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బాస్ స్కూల్‌లో విద్యార్థినికి గాయాలు

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ పట్టణంలోని అబ్బాస్ పాఠశాలలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు విద్యార్థినికి గాయాలైన సంఘటన చూపిస్తుంది. ఆదివారం సాయంత్రం పాఠశాలలు విద్యార్థులు అందరూ ఒక దగ్గర కూర్చొని టీవీ చూస్తుండగా ఒకసారిగా షార్ట్ సర్క్యూట్ అయి టీవీ పేలిపోయింది. టీవీ నుంచి పొగలు రావడంతో భయంకరనకు గురైన విద్యార్థులు ఒకసారిగా పరుగులు తీశారు. ఆ సమయంలో రామచంద్ర మండలం వీళ్ళ పాలెం చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని పైనుంచి విద్యార్థులు తొక్కి వెళ్లడంతో గాయాల పాలయ్యాయి. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వాళ్ళు వైద్యానికి నిరాకరించడంతో మరో ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. కాగా ఆ విద్యార్థి గతంలోని ఆరోగ్య సమస్యలు ఉన్నాయని పాఠశాల యాజమాన్యం చెబుతున్నారు. ప్రస్తుతం ఆ బాలిక ఆరోగ్యం నిలకడగా ఉంది.

ఉపాధ్యాయులను స్కూల్లో ఉంచాలని ధర్నా

నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిప్యూటేషన్‌పై వనిపాకలకు వెళుతున్న ఉపాధ్యాయురాలును చిట్యాల పాఠశాలలోనే ఉంచాలని విద్యార్థులు సోమవారం పాఠశాలలో ధర్నా నిర్వహించారు. జిల్లా విద్యాధికారి జోక్యం చేసుకొని పాఠశాలలోని ఉపాధ్యాయుల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించి, విద్యా బోధనకు అంతరాయం కలగకుండా తమకు న్యాయం చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

గృహలక్ష్మి పథకం అర్హులకు వర్తింపజేయాలి :సీపీఐ(ఎం)

నవతెలంగాణ-నాంపల్లి

గృహలక్ష్మి పథకం మంజూరులో రాజకీయ జోక్యం లేకుండా, పారదర్శకంగా సర్వే నిర్వహించి, పూరిగుడిసె ఉండి, అది కూడా లేని ఖాళీ స్థలం ఉన్న, అద్దె ఇంట్లో నివసిస్తున్న అర్హులైన నిరుపేదలకు, గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి అన్నారు. ప్రభుత్వం రాజకీయ జోక్యం లేకుండా మొదటి విడతలో అర్హులైన పేదలకు గృహలక్ష్మి పథకం మంజూరు చేసి పేదల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైదులు, దుర్గయ్య, శ్రీను, వెంకటయ్య, యాదగిరి, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.



దైదను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలని తీర్మానం

నవతెలంగాణ-నకిరేకల్

టీపీసీసీ రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దైద రవీందర్‌ను నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నియమించి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలని సోమవారం నకిరేకల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ స్థానికుడైన దైద రవీందర్ గత ఐదేళ్లుగా కాంగ్రెస్ పార్టీని తన భుజస్కంధాలపై మోస్తూ పార్టీని కాపాడుతున్నారని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పిలుపుతో ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి నాయకత్వంలో పార్టీ ఇచ్చిన పిలుపులను అమలుపరుస్తూ జన సమీకరణ చేయడంలో ముందున్నాడని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు అండగా ఉంటూ పేదలకు ఆర్థిక సహాయం చేస్తున్న రవీందర్‌కు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలన్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మెన్ గార్లపాటి రవీందర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొబ్బల నరసింహరెడ్డి, కౌన్సిలర్ దైద స్వప్న, నాయకులు దేవులపల్లి వెంకన్న, మొహమ్మద్ సర్వర్ మియా, చింతల శ్రీనివాస్, కందాల రత్నారెడ్డి, ఆకుల దంతేశ్వరి, పోతుల యాదగిరి, దేవిక, అల్లి అంజన్‌కుమార్, దీకొండ ధనమ్మ, జాన సుధాకర్, ఒంటెపాక నాగయ్య, ఎండి.యూసుఫ్, అబ్దుల్ మజీద్, ముషం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్లో సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని పాఠశాల విద్యా కమిటీ చైర్మెన్ పోలేపల్లి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనుసరిస్తున్న విధానం వల్ల విద్యార్థులు నష్ట పోతున్నారని సోమవారం ఈ మేరకు ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కలెక్టర్ వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.



బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మండల పరిధిలోని బెండల పహాడ్ గ్రామ పంచాయితీ ఆవాస గ్రామం బాగిగుడెం చెందిన కాంగ్రెస్ పార్టీ, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు 50 మంది సోమవారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో నార్కట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షాపెల్లి గ్రామ సర్పంచ్, బెండల పహాడ్ గ్రామ సర్పంచ్, శేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ మాజీ ప్రధాన కార్యదర్శి చినపాక. రమేశ్, మాజీ సర్పంచ్ రాందాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూ డిగ్రీ ఫలితాలు విడుదల

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ 1, 3, 4, 5, 6 సెమిస్టర్ల ఫలితాలను ఉపకులపతి ఆచార్య గోపాల్‌రెడ్డి సోమవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. డిగ్రీ రెండవ సంవత్సరం రెగ్యులర్ పరీక్షల ఫలితాలను త్వరలో వెల్లడించనున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కారణంగా తరగతుల నిర్వహణ, విద్యా సంవత్సర ప్రణాళిక, పరీక్షల నిర్వహణ వంటి అనేక అవరోధాలను సైతం అధిగమించి సకాలంలో నిర్వహించి ఫలితాలను విడుదల చేయడం సంతోషం అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుండి కరోనా పూర్వం విద్యా సంవత్సరం ప్రకారం విద్య కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు అధ్యయనంపై దృష్టి సారించి విజయాలు సాధించాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ ఆచార్య తుమ్మ కృష్ణారావు, ఓ ఎస్ డి ఆచార్య అల్వాల రవి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ మిరియాల రమేష్, అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ ప్రవళిక పాల్గొన్నారు.



బాధితులకు సత్వర న్యాయం చేయాలి

• గ్రీవేన్స్‌లో వలు ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్


బాధితులకు సత్వర న్యాయం చేయాలని సంబంధితర అధికారులను ఎస్పీ అపూర్వరావు ఆదేశించారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో బాగంగా జిల్లా ఎస్పీ అపూర్వరావు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 30 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. వచ్చిన పిర్యాదులు భూ సమస్యలు, భార్య భర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్ సమస్యల పైన పిర్యాదులు రావడం జరిగిందని తెలిపారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఎవరైనా చట్టవ్యతిరకమైన చర్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వారి పట్ల కటినంగా వ్యవహరించాలని సూచించారు. బాధితుల ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.



పెండింగ్ స్కాలర్ షిప్ విడుదల చేయాలి

నవతెలంగాణ-చండూరు

పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగెల వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చండూరులో సోమవారం ఎఐఎస్ఎఫ్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యరంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లమల ఆంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి ఇరిగీ ప్రవీణ్, బొడ్డుపెల్లి అర్జున్, మండల కార్యదర్శి కురుపాటి పరమేష్ పాల్గొన్నారు.



అన్నమయ్య భజనమండలి సభ్యులకు అభినందనలు

నవతెలంగాణ-హుజూర్‌నగర్

పట్టణానికి చెందిన అన్నమయ్య భజన మండలి కమిటీ సభ్యులను రాష్ట్ర భక్తి భజనప్రచార వ్యవస్థాపకులు శివప్రసాద్ సుధారాణి దంపతులు అభినందించినట్లు అన్నమయ్య భక్తి భజన ప్రచార గురువు చప్పిడి భిక్షం, వ్యవస్థాపక అధ్యక్షులు బాచిమంచి కొండయ్య తెలిపారు.ఆదివారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర భక్తి భజన ప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొని ఆరు గంటలు పాటు 120 కీర్తనలు పాడినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆకుల రజిని, దామెర అనంతలక్ష్మి, గుండా సుశీల,పారేపల్లి సరస్వతి, వెన్న పద్మబ్రినాథ్, సుబ్బమ్మ, పెద్దపుష్ప,ఆండాలు, రమణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌టీఓ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-కోదాడరూరల్



పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయ సమీపంలో నూతనంగా నిర్మించిన డీఎస్‌టీఓ కార్యాలయాన్ని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతా కవితరాధారెడ్డి, డీటీఓ రవికుమార్, ఏటీవో ఎండి షరీఫ్ బాబా, ఎస్‌టీఎం వెంకన్న, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వరి నాటేసిన పొలాలను కాపాడాలి

- కౌలు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నెం పాపిరెడ్డి

నవతెలంగాణ-కోదాడరూరల్

నాగార్జునసాగర్ కెనాల్ కింద బోర్లు బావుల కింద వరి నాటు వేసిన పొలాలు ఎండిపోతున్నాయని, తక్షణమే ఆ పొలాలకు నీటిని విడుదల చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నెం పాపిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాలలోఎండిపోతున్న వరి పొలాలను పరిశీలించి మాట్లాడారు.గత నెలలో కృష్ణ బేసిన్ లో వర్షాలు కురవడం పైన ప్రాజెక్టులకు నీళ్ల రావడంతో రైతాంగం నాగార్జునసాగర్ ఆయకట్టు ఎడమ కాలువ కింద మిర్యాలగూడ,హుజూర్‌నగర్, కోదాడ నియోజవర్గ రైతులు దాదాపుగా వరి నాట్లు పూర్తి చేశారన్నారు.నాట్లు వేసి నెల అవుతుంది నెల రోజుల నుండి వర్షాలు లేక బోర్లు బావులలో నీరు అడుగంటి పోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతాంగం ఉందన్నారు.బావులు కూడా ఎండిపోయాయన్నారు.బోర్లలో వచ్చే చాలీచాలని నీటితో పంటపొలాలు నెర్రెలు బారాయన్నారు.ఈ విషయమై ఎమ్మెల్యేలతో మాట్లాడామన్నారు.వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు అమరబోయిన ఎలమంద, భిక్షమారెడ్డి, వెంకట్‌రెడ్డి, సైదిరెడ్డి, వెంకటరెడ్డి, రాములు, రాంరెడ్డి, తదితర రైతులు పాల్గొన్నారు.



పాఠశాల స్థాయి క్రీడల కమిటీ సన్నాహక సమావేశం

నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ నియోజకవర్గ వ్యాయామ విద్య ఉపాధ్యాయుల పాఠశాల క్రీడల సన్నాహక కమిటీ సమావేశం పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపు హైస్కూల్‌లో సోమవారం నిర్వహించారు.మేళ్లచెర్వుపాలకీడు,చింతలపాలెం హుజూర్‌నగర్ మండల స్థాయి క్రీడలు ఈనెల 28, 29 తేదీలలోనూ, గరిడేపల్లి, మఠంపల్లి, నేరేడుచర్ల మండల స్థాయి క్రీడలు సెప్టెంబర్ 1,2వ తేదీల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.ఈ సమావేశంలో ఎంఈఓలు చత్రునాయక్, సైదా నాయక్,హెచ్ఎం శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ ఇన్‌చార్జి మన్యం సీతారాంరెడ్డి, డి.రవి, నియోజకవర్గ మండలాల బాధ్యులు నాగమణి, రేణుక, శ్రీనివాస్, చంపాలాల్, యాదయ్య ఉపేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు సునీల్, ఏసుపాదం, యాదగిరి,మైసయ్య, వెంకటేశ్వర్లు, ఉస్మాన్, భాగస్వామి, అంబేద్కర్,రాజ్యలక్ష్మి, ధనమ్మ, రవీందర్‌రెడ్డి, వీరస్వామి, ప్రదీప్, లలిత, ప్రమీల, ఉష పాల్గొన్నారు

నిరుపేదలకు దళితబంధు ఇవ్వాలి

నవతెలంగాణ-నాగారం

అర్హులైన నిరుపేదలకు దళితబంధు ఇవ్వాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కడియంకుమార్ డిమాండ్ చేశారు.సోమవారం నాగారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.దళితబంధులో రాజకీయ ప్రమేయం ఉండొద్దన్నారు.ఈ సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి గుడిపూడి వెంకటేశ్వర్లు తంగేళ్ల వెంకన్న, మహేందర్, కందేభిక్షం, యాదమ్మ, అంజయ్య రాములు, ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు చేసుకోవాలి

నవతెలంగాణ-నాగారం

బేసిక్ అవర్ లీ పై బోధించే ఉపాధ్యాయులు మండల పరిధిలోని పసునూరు గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్‌లో ఈనెల 23 వరకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కుంట రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో సివిక్స్, 9,10వ తరగతుల్లో సోషల్ సబ్జెక్టులలో బోధించే ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు

నవతెలంగాణ-పెన్‌పహాడ్



ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందడంతో పాటు మరొకరికి గాయా లైన ఘటన మండలంలోని దుపహాడ్ వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది.ఎస్ఐ నర్సింగ్ వెంకన్నగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని రాజీవ్ నగర్ కు చెందిన పిడమర్తి మల్లయ్య(50) ఒగ్గు నర్సయ్యతో కలిసి గరిడేపల్లిలో ఒక శుభకార్యానికి వెళ్లాడు.తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో దుపహాడ్ శివారులో కేసీఆర్ సూర్యాపేట బహిరంగ సభకు వెళ్లి వస్తున్న లింగాల గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఢీకొనడంతో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.కాగా నర్సయ్యకు గాయాలవ్వడంతో అతన్ని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు.మల్లయ్య మృతదేహాన్ని పోస్టు మార్టం కుటుంబ సభ్యులకు అప్పగించారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఈనెల 16వ తేదీ నుండి జరుగుతున్న ఏఎన్ఎంల నిరవధిక సమ్మెలో భాగంగా న్యూ కలెక్టరేట్ వద్ద జరుగుతున్న సమ్మెకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలతో సంబంధం లేకుండా రెగ్యులర్ చేయాలని రెగ్యులేషన్ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు ఏఎన్ఎంలకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు.ప్రతిరోజూ ప్రతిరోజు సాయంత్రం ఆరు గంటలు దాటిన తర్వాత రిపోర్ట్ పంపించాలని ఒత్తిడి చేయవద్దన్నారు. ఏఎన్ఎంలతో పని చేయించుకుంటూ పనికి తగ్గ వేతనం ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్, ఏఐటీయూసీ సూర్యాపేట ప్రాంతీయ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, సెకండ్ ఏఎన్ఎం యూనియన్ నాయకురాలు విజయ, గోపమ్మ,రమాదేవి,స్వప్న, విమల,సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాఅర్జీలపై సత్వరమే స్పందించాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

నవతెలంగాణ- సూర్యాపేటకలెక్టరేట్

ప్రజావాణి అర్జీలను జిల్లా అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా అధికారులను కలెక్టర్ యస్. వెంకట్రావు ఆదేశించారు.సోమవారం నూతన కలెక్టరేట్‌లో మొదటి రోజున అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డిలతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తో సూర్యాపేటలో నూతన కలెక్టరేట్, మెడికల్ కళాశాల, డీపీఓ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించుకున్నామని తెలిపారు.సూర్యాపేట జిల్లా దినదినాభివృద్ధి చెందుతున్నందున ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించనున్నట్లు తెలిపారు.నూతన కలెక్టరేట్‌లో శాఖలను కేటాయించిన వారీగా వీలైనంత త్వరగా కార్యాలయాలను సత్వరమే మార్చాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో అర్జీదారులు ఎక్కువగా వివిధ భూసమస్యలపై అర్జీలు ఆ దించారని అట్టి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు 32, ఇతర శాఖలకు సంబంధించి 6 మొత్తం 38 దరఖాస్తులు వచ్చాయన్నారు. ముందుగా నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం జరుపుకున్న సందర్భంగా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అధికారులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, డీఏఓ రామారావునాయక్, డీహెచ్ఓ శ్రీధర్‌గౌడ్, డీఈఓ అశోక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.హర్షవర్ధన్,సంక్షేమ అధికారులు జ్యోతి పద్మ, అనసూర్య, శంకర్, అధికారులు, సిబ్బంది, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లా కేసీఆర్ ఖిల్లా

- కరిగే మంచుకొండ కాంగ్రెస్
- కెసిఆర్ నమ్మకాన్ని నిలబెడతాం
- 12 అసెంబ్లీస్థానాల్లోనూ ఎగిరేది గులాబీజెండానే
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ బలానికి నిదర్శనం, రాబోయే శాసన సభ ఎన్నికలగాను ముఖ్యమంత్రి చేసిన అభ్యర్థుల ప్రకటన అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. అన్నారు.సోమవారం స్థానిక సుమంగళి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పార్టీ కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున సూర్యాపేట అభ్యర్థిగా మూడవసారి తనకు, ప్రస్తుత శాసనసభ్యులకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర మంత్రిగా అవకాశం పొందడానికి తనకు సహకరిస్తున్న ప్రతి ఒక్క బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.ఉమ్మడి నల్లగొండ జిల్లా కేసీఆర్ ఖిల్లా అని పేర్కొన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ స్ఫూర్తిని కొనసాగిస్తూ 12 స్థానాల్లో గులాబీ జెండా ఎగరేసి కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టు కుంటామని తెలిపారు.రాజకీయాల్లో టికెట్లు ఆశించడం తప్పు కాదని టికెట్ రానివారు నిరాశపడవద్దన్నారు. వచ్చిన వారు కూడా తమ సహచర నేతలను కలుపుకొని పనిచేసి పార్టీ , నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మహిళలు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

మూడోసారి సూర్యాపేట నుండి మంత్రి జగదీశ్‌రెడ్డిని ముఖ్యమంత్రి కేసీఆర్ అభ్యర్థిగా ప్రకటించడంతో సూర్యాపేట నియోజకవర్గ వ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి.తమకు అభివృద్ధిని పరిచయం చేసిన జగదీశ్ రెడ్డి మూడోసారి పోటీ చేస్తున్నారని విషయం తెలిసిన వెంటనే బీఆర్ఎస్ కార్యకర్తలు,మహిళాలు, నాయకులు సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుతూ, బాణాసంచా కాలుస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.ముఖ్యంగా మహిళ నాయకులు డ్యాన్సులు చేస్తూ మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.సూర్యాపేట పట్టణంలోని తెలంగాణ తల్లి బొమ్మ వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.సూర్యాపేటలో శాంతి భద్రతలు నెలకొల్పి, సూర్యాపేట ను ప్రపంచ సాయి పట్టణంగా తీర్చిదిద్దుతున్న జగదీశన్నను మూడోసారి గెలిపించుకుంటామని వాగ్దానం చేశారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి



నవతెలంగాణ-సూర్యాపేట

నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరించాలని ఆ సంఘం అధ్యక్షులు ఎం.నర్సింహ డిమాండ్ చేశారు.ఎన్‌హెచ్ఎం స్కీంలో వివిధహోదాలో పని చేస్తున్న సిబ్బంది సోమవారం స్థానిక జిల్లా వైద్య శాఖ అధికారి కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసు క్రమ బద్ధీకరించడంతో పాటు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా ధర్నా నిర్వహించినట్టు తెలిపారు.ఎన్‌హెచ్ఎం స్కీమ్‌లో అతి తక్కువ జీతాలతో పని చేస్తున్నామని పేర్కొన్నారు. 510 జీవో కూడా సెప్టెంబర్ 2018 నుండి వచ్చినప్పటికీ ప్రభుత్వం ఇంతవరకు వర్తింప చేయలేదన్నారు. జీవో నెంబర్ 720, డిసెంబర్ 2021 16న వచ్చిన వేతనాల పెంపు కూడా వర్తింప చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ ధర్నాలో నేషనల్ హెల్త్ మిషన్ స్కీం లో పని చేస్తున్న జిల్లా బ్లాక్ ప్రోగ్రాం మేనేజ్మెంట్ యూనిట్ స్టాప్, ఎన్‌టీపీలో పని చేస్తున్న ఎస్‌టీఎస్, ఎస్టీఎల్ఎస్, టీబీహెచ్వీ,డీపీఎం డేటా ఎంట్రీ ఆపరేటర్స్, అకౌంటెంట్స్ బ్లాక్ లెవెల్ అకౌంటెంట్స్, కమ్యూనిటీ ఆర్గనైజర్స్,సపోర్టింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సింహగర్జనను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

సెప్టెంబర్ 5న సూర్యాపేటలో జరిగే బీసీసింహగర్జనను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, భూమన్న యాదవ్, డాక్టర్ రామ్మూర్తియాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ఐఎంఏ ఫంక్షన్‌హాల్‌లో బీసీ సంక్షేమసంఘం జిల్లా సన్నాహక సమావేశం బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు వీరబోయిన లింగయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయ పార్టీలు జనాభా ధామాషా ప్రకారం బీసీలకు పార్లమెంట్, అసెంబ్లీలో 50 శాతం సీట్లు కేటాయించాలని కోరారు.అన్ని పార్టీలు పార్లమెంట్లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. బీసీలకు బీసీబంధు, కొన్ని కులాలకే కాకుండా బీసీవర్గంలో ఉన్న అన్ని కులాలకు మంజూరు చేయాలని కోరారు.బీసీల కులగణన చేపట్టి ఆలెక్కల వివరాలను బహిరంగంగా వెల్లడించాలన్నారు.ఎస్సీ, ఎస్టీ ,బీసీలు 77 ఏండ్లుగా వెనకబడి పోతున్నారని, ఇకనైనా బీసీలను గుర్తించి అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు తగిన ప్రాధాన్య ఇవ్వకపోతే రాజకీయ పార్టీలకు భవిష్యత్ ఉండదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు దూదిపాల ధనుంజయనాయుడు, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలిమినేట్ రమేష్,పచ్చిపాల రామకృష్ణ, దేగల రమేష్, విశ్వకర్మల జిల్లా అధ్యక్షుడు



పోతుగంటి వీరాచారి, బీసీసంక్షేమసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కృష్ణమాచారి, శ్రీనివాస్‌నాయుడు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, జటంగి వెంకట్‌నర్సయ్య, తిరుమలగిరి అశోక్, గూడెపు దీప, రమా, అశోక్, లక్ష్మీనారాయణ, లింగయ్య,వీరాచారి, సుమన్, సాయి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-సూర్యాపేటరూరల్

ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్‌తో హైదరాబాదులో సెప్టెంబర్ నెలలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి తూరుగంటి అంజన్న మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం జనగాం ఎక్స్‌రోడ్ నందు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గత 29 సంవత్సరాలుగా ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ కోసం జరుగుతున్న పోరాటంలో భాగంగా నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ సీనియర్ నాయకులు బోడ శ్రీరాములు మాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టల మల్లేష్ మాదిగ, వికలాంగుల హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షులు చింత సతీష్, ఎమ్మార్పీఎస్ సూర్యాపేట మండల అధ్యక్షులు తాటిపాముల నవీన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు బొజ్జ వెంకన్నమాదిగ, సూర్యాపేట ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఎంఎస్పీ టౌన్ కన్వీనర్ దైద వెంకన్నమాదిగ, నాయకులు వేల్పుల నవీన్‌మాదిగ, చింత రవి ,తరాల కిరీటి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న చేరికల జోష్

నవతెలంగాణ-సూర్యాపేట

సూర్యాపేట నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి మద్దతుగా నియోజకవర్గంలో కాంగ్రెస్,బీజేపీకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలను వీడి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకుంటున్నారు.తాజాగా సూర్యాపేట రూరల్ మండలం యండ్లపల్లికి చెందిన ఉపసర్పంచ్ యాదగిరిరెడ్డి, నరేష్, రామారావు గ్రామానికి చెందిన రెండవ వార్డ్ సభ్యులు మారపాక యాదయ్యతో పాటు 50 మంది కార్యకర్తలు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.రాబోయే ఎన్నికల్లో మంత్రి జగదీశ్‌రెడ్డి లక్ష ఓట్ల మెజార్టీతో గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు.

నేడు గద్దర్, జహీర్‌అలీఖాన్ సంస్మరణసభ

నవతెలంగాణ-సూర్యాపేట

ఈనెల 22వ తేదీన సాయంత్రం ఐదు గంటలకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగే ప్రజా గాయకులు గద్దర్, జహీర్‌అలీఖాన్ సంస్మరణ సభను జయప్రదం చేయాలని గద్దర్,జహీర్ అలీఖాన్ స్మారక కమిటీ అధ్యక్షుడు నారబోయిన వెంకట్‌యాదవ్ పిలుపునిచ్చారు.సోమవారం స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సంస్మరణసభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రేపాక లింగయ్య,మండారి డేవిడ్, చామకూరి నర్సయ్య, అబ్దుల్ కరీం, బుద్దా సత్యనారాయణ,ఆవుల నాగరాజు, నాగయ్య,భాను ప్రసాదు, మాంద్ర మల్లయ్య,మట్టపల్లి సైదులు ,రమా శంకర్,పేర్ల నాగయ్య,దాసరి రాములు, అనంతుల మధు, కోట గోపి, వాసు, గోపీనాథ్, బందన్‌నాయక్,వీరబాబు,పుల్లూరు సింహాద్రి, భరత్ పాల్గొన్నారు.



గృహలక్ష్మీ పథకం అర్హులకు వర్తింపజేయాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్

అర్హులైన నిరుపేదలకు గృహలక్ష్మీ పథకం వర్తింపజేయాలని సీపీఐ(ఎం)మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్ అన్నారు. హుజూర్‌నగర్ మండల పరిధిలోని అమరవరం గ్రామంలో కదిర రామనర్సమ్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వం రాజకీయ జోక్యం లేకుండా మొదటి విడతలో అర్హులైన పేదలకు గృహలక్ష్మీ పథకం మంజూరు చేసి పేదల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. రాజకీయ జోక్యంతో ఇష్టానుసారంగా గృహలబ్దిదారుల ఎంపిక చేస్తే అర్హులు నష్టపోయి ప్రభుత్వ లక్ష్యం నెరవేరదన్నారు.ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి షేక్ ఖాశీం, శాఖ సభ్యులు షేక్ బుద్ది, బాలసైదులు, తేనె సీతారాములు, తేనె బాల సైదులు, జిట్టబోయిన అరవింద్, లింగయ్య పాల్గొన్నారు.

మున్న శంకర్‌కు నివాళులు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండలపరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన మున్న శంకర్ అనారోగ్యంతో సోమవారం మరణించారు.ఆయన మృతదేహానికి ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మెన్ వట్టె జానయ్యయాదవ్, అనాజిపురం సర్పంచ్ చెన్ను శ్రీనివాసరెడ్డి వేర్వేరుగా హాజరై వారి మృతదేహానికి పూలమాలవేసి నివాళు లార్పించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పేర్ల లింగయ్య, గురవయ్య, నవీన్, సైదిరెడ్డి, జనార్దన్, సుదీర్, సతీష్, వెంకన్న, కిరణ్, సురేష్, నరేష్, పవన్, సతీష్, గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-మఠంపల్లి

స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను కోరారు.సోమవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ 40 ఏండ్లుగా స్కూల్ సీపర్లు పనిచేస్తున్నారని.వారికి రూ.10600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్ రన్‌మియా, కుమారి, లాల్‌సాహెబ్ ,కోటి, భవాని, సాలమ్మ,యశోధ,మీరాబీ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ముదిరాజ్‌ల హక్కుల కోసం ఐక్యంగా పోరాటం చేయాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

రాష్ట్రంలో ముదిరాజ్‌లు హక్కుల కోసం ముదిరాజ్ కులస్తులంతా ఐక్యంగా పోరాటం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుండి బీసీ-ఏకు మార్చాలని కోరారు.రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్‌లకు 25 సీట్లు కేటాయించాలని డిమాండ్‌చేశారు.రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ కార్యక్రమాలను ముదిరాజ్‌లకు పూర్తిస్థాయిలో అందేలాగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షులు యాదగిరి, లింగబోయిన సత్యనారాయణ, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఇంటి అచ్చమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగబోయిన రామకృష్ణ, తండు రేణుక, బొక్క శ్రీను, శ్రీను ములుకపల్లిపల్లి ఠాగూర్, పట్టణ అధ్యక్షులు ములకలపల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నవతెలంగాణ-మోతె

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రాఘవపురం ఎక్స్‌రోడ్డు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది.స్థానిక తెలిపిన వివరాలు ప్రకారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ఎర్రగడ్డ గ్రామానికి చెందిన మల్లెల శశికళ 44 సంవత్సరాలు మృతి చెందినట్లు తెలిపారు భార్య శశికళ భర్త ఉపేందర్ గ్రామంలో సుతారి పని ముగించుకుని వెళ్తున్నట్టు తెలిపారు రాఘవపురం గ్రామానికి చెందిన బయ్య గంగయ్య ట్రాక్టరు ఎదురెదురుగా ఢీకొనడంతో భార్య శశికళ మృతి చెందగా భర్త ఉపేందర్ కు కాలు విరిగినట్లు తెలిపారు.



జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలని వినతి

నవతెలంగాణ-తిరుమలగిరి

వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలని కోరుతూ డీజేఎఫ్, టీయూడబ్ల్యూజే ఐజేయూ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వర్కింగ్‌జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌తో సంబంధం లేకుండా ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.వినతిపత్రం అందజేసిన వారిలో డీజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు రెహమాన్‌అలీ, ఐజయూ జిల్లా కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, తిరుమలగిరి మండలం ఐజేయూ కమిటీ అధ్యక్షులు నిమ్మల వీరస్వామి,గౌరవాధ్యక్షులు చాంద్‌పాషా, ఉపాధ్యక్షులు నిర్మల బాలకృష్ణ, కార్యదర్శి కొమ్ము ప్రవీణ్, కోశాధికారి బాకి శ్రీనివాస్, కార్యదర్శి ఊడుగు సుధాకర్, సంయుక్త కార్యదర్శి బానోతు రాములునాయక్, కార్యవర్గ సభ్యులు చిలకల ప్రకాష్, ఫత్తేపురం విజయ్, నెల్లుట్ల రాజు తదితరులు పాల్గొన్నారు..

ఈఎంటీ ఉద్యోగ అవకాశం

బొమ్మలరామారం : మండలంలోని 108 నూతన వాహనంపై అత్యవసర సేవలందించడానికి ఈఎంటి (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు నుంచి దరఖాస్తులు స్వీకరించినట్టు. జిల్లా మేనేజర్ మండ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎంటి ఉద్యోగానికి సైన్స్ గ్రూపులో డిగ్రీ, డిప్లమా ఇన్ ఈఎంటి, బీఎస్సీ, బైపిసి, ఎస్ ఎస్ సి, పూర్తిచేసి ఏఎన్ఎం, చేసి నవారా ఎస్ఎస్ సి, పూర్తి చేసి ల్యాబ్ టెక్నీషియన్ చేసిన 30 సంవత్సరాల లోపు వారి అర్హతలని అన్నారు. ఎంపికైన వారికి ట్రైనింగ్ 45 రోజులు ఉంటుందన్నారు. ఈనెల 22న భువనగిరి జిల్లా ఆస్పత్రి 108 కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.అర్హులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్ లతో పాటు ,ఒక సెట్ జిరాక్స్ తీసుకురావాలని వివరాలకు 9985226582,80089355 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

కిడ్నీ బాధితునికి రూ.52వేల ఆర్థిక సాయం

నవతెలంగాణ -భూదాన్ పోచంపల్లి

మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన బోయిని మధు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. అతని చిన్ననాటి మిత్రులు 2006-07 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు రూ.52 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శివ లింగారెడ్డి నరేష్ శివాజీ, శ్యామల, రేణుక ,జ్యోతి, మాధవరావు, కిరణ్, లింగస్వామి ,తదితరులు పాల్గొన్నారు.

బస్వాపురం రిజర్వాయర్‌ను నిర్ణీతగడువులోగా పూర్తిచేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్

నవతెలంగాణ -భువనగిరిరూరల్

బస్వాపురం రిజర్వాయర్‌ను నిర్ణీతగడువులోగా పూర్తిచేయాలని ,చిన్న నీటి వానరులైన పిల్లయిపెల్లి, ధర్మారెడ్డి కాల్వ, భునదిగాని కాల్వ పనులను పూర్తిచేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్ కోరారు. జిల్లాలోని 17 మండలాలు 421 గ్రామపంచాయతీలు ఆరు మున్సిపాలిటీలలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం జిల్లా సమస్యల పరిష్కార కోసం సీపీఐ(ఎం) ఒక ప్రణాళిక బద్ధంగా పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలో ముఖ్యంగా 16 డిమాండ్స్ తో కూడిన సమస్యలపై మహదన్న కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రధానంగా పేదలు భూ సమస్యలు





పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నట్లు వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండ్ల పట్టాలు భూముల పట్టాలు ఉన్నవారికి భూములు చూపించకపోవడంతో రైతుల ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వైద్యం 2014 మేనిఫెస్టోలో టిఆర్ఎస్ ప్రభుత్వం చెప్పిన ప్రకారం ప్రతి మండల కేంద్రంలో ముగ్గురు ఎంబీబీఎస్ డాక్టర్లతో మండల ఆసుపత్రి ఏర్పాటు, అన్ని మండలాల్లో పి హెచ్ సి ఎంబిబిఎస్ డాక్టర్లు రెగ్యులర్ ఉండాలని, జిల్లా కేంద్ర ఆస్పత్రికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి చేస్తామన్న హామీలను నెరవేర్చాలని కోరారు. రహదారులకు లింకు రోడ్లు ఏర్పాటు చేయాలని జిల్లాల్లో 88 కల్వర్టు ప్రమాదకరంగా ఉన్నట్లు, అందులో 34 కల్వర్టు అత్యంత ప్రమాదకరంగా ఉన్నట్లు వర్షం పడితే కలవట్ల నుంచి నడవరాక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మూసీని ప్రక్షాళన చేసి గోదావరి జిల్లాలతో నింపి ఈ ప్రాంత రైతులకు మూసీ వ్యర్థపదార్థల నుంచి కల్పించాలని డిమాండ్ చేశారు. గంగానదికి 20వేల కోట్లు ఎలాగైతే కేటాయించిందో కేంద్ర ప్రభుత్వం మూసీనది కూడా అంతే స్థాయిలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

పెండింగ్‌లో ఉన్న భూమి పంపిణీ వెంటనే కొనసాగించాలి
రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహా

గుండాల మండల కేంద్రంలో పేదలు సాగు చేసుకుంటున్నా భూములకు పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ కోరారు. చౌటుప్పల్ మండలంలో 401 ఎకరం కాంతిశికుల భూమిని పేదలకు పంపిణీ చేయాలని, దిల్ సంస్థకు ఆనాడు వైఎస్ఆర్ ప్రభుత్వం ఇచ్చిన భూమి పేదల చేతులలో సాగుచేసుకుంటున్న పరిస్థితి ఉన్నదని అన్నారు. గతంలో వాళ్ల దగ్గర పాస్‌బుక్‌లు ఉన్నాయి వాళ్లందరికీ ఆ భూములను తిరిగి నూతన పాసుబుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



జిల్లాలో నిరుపేదలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలి
సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ

జిల్లాలో భూ సమస్యలు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, విద్యా, వైద్యం సమస్యల పరిష్కార కోసం ప్రభుత్వాలు అనేక హామీలు ఇచ్చిన నేటికీ నెరవేరలేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ అన్నారు . అర్హులైన వారందరికీ డబుల్‌బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పటివరకు ఎక్కడ కూడా జిల్లాలో పంపిణీ చేసిన దాఖలాలు లేవన్నారు. జిల్లా కేంద్రంలో 2015 సంవత్సరం ప్రారంభమైన డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నేటికీ పూర్తి కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



రైతాంగ సమస్యలను పరిష్కరించాలి
సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు

జిల్లాలో నెలకొన్న రైతాంగ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు కోరారు. బసవపురం రిజర్వార్లు పూర్తిచేసి, వడపర్తి తక్కువ వద్ద మినీ రిజర్వాయర్ల తయారుచేసి రైతులకు గోదావరి జల్లాలను అందించాలని కోరారు. ధరణి వెబ్‌సైట్ వచ్చిన తర్వాత భూ సమస్యలతో కలెక్టర్ కార్యాలయం చుట్టూ ప్రదక్షణ చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు భూ సమస్యలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



సంస్థాన్ నారాయణపురం మండలానికి సాగునీరు అందించాలి
సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనూరి నర్సిరెడ్డి

సంస్థన్ నారాయణపురం మండలానికి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని తీసుకువచ్చి రైతాంగానికి తాగు, సాగునీరు అందించాలని, ప్రభుత్వం వెంటనే పాలమూరు రంగారెడ్డి పై డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్ట్ ను విడుదల చేయాలని సీపీఐ(ఎం) జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు దోనూరు నర్సిరెడ్డి కోరారు.సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా రాచకొండ భూములను పర్యాటక ప్రదేశంగా మార్చాలని కోరారు. సర్వేల్ లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ చేపట్టాలని కోరారు .



యాదగిరిగుట్టలో ఆటో కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి
సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మంగ నరసింహులు

యాదగిరిగుట్ట దేవస్థానం తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా మారిందని, గుట్టపై ఆధారపడి జీవించే వారికి ఉపాధి అవకాశం కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మంగ నరసింహులు కోరారు. యాదగిరిగుట్ట డెవలప్మెంట్ అథారిటీ వైటిడిఏ పరిధిలో గుట్ట అభివృద్ధి జరిగిన గుట్టని నమ్ముకుని బతుకుతున్న ఆటో కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని వారికి దేవస్థానంలో ఉద్యోగాలు కల్పించాలని లేనియెడల ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.



ధర్నాలో వీర్లపల్లి ముత్యాలు, గంటపాక శివ, హనుమంతు నర్సింహ పాడిన పాటలు ప్రజలను చైతన్యవంతం చేశాయి. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సిరిపంగి స్వామి, దయ్యాల నరసింహ, మాయ కృష్ణ ,బొల్లు యాదగిరి ,ఎండి పాషా, జల్లల పెంటయ్య, బబ్బురి పోశెట్టి, బొడ్డుపల్లి వెంకటేష్, గుంటూజు శ్రీనివాస్ చారి ,గుండు వెంకట నర్సు ,గంగాదేవి సైదులు, మద్దెపురం రాజు, రాచకొండ రాములమ్మ, గడ్డం వెంకటేష్ ,వనం ఉపేందర్ , ధూపటి వెంకటేష్ ,పోతరాజు జహంగీర్ ,రేఖల శ్రీశైలం, వేముల బిక్షపతి ,బుర్రు అనిల్ పాల్గొన్నారు.

అస్థవ్యస్తంగా ప్రభుత్వ విద్య

- సమయ పాలన పాటించని ఉపాధ్యాయులు
- పర్యవేక్షించే దిక్కులేదు
- తప్పుడు ఎన్‌రోల్‌మెంట్‌తో కాలం వెళ్లదీత
- ప్రార్ధనను మర్చిపోయిన పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు



నవతెలంగాణ -సంస్థాన్ నారాయణపురం

పాలకుల నిర్లక్ష్యానికి తోడు పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు పట్టించుకోని కారణంగా మండలంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.పూర్తిస్థాయి ఎంఈఓ లేకపోవడం వల్ల పర్యవేక్షణ కొరవడి పంతులు ఇస్తారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.ముఖ్యంగా మండలంలోని గిరిజన తండాల్లో పనిచేసే ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా ఉదయం 10 గంటల తర్వాత రావడం మధ్యాహ్నం 3 గంటలకు వెళ్లడం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమీపంలోని ప్రయివేటు పాఠశాలలకు పంపుతున్నట్లు తెలిసింది.గిరిజనులు ఉదయం 9 దాటిందంటే ఇంటిదగ్గర ఎవరు కనిపించరు.వృద్ధులు తప్ప అందరూ వ్యవసాయ పనులకు ఇతర ప్రాంతాలకు కూలీకి వెళ్తుంటారు.ప్రశ్నించే దిక్కు లేక పంతుల్లో ఇష్టం వచ్చినట్టు వెళ్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు.గిరిజన తండాల్లోని ప్రభుత్వ పాఠశాలలో నలుగురు, ఐదుగురు విద్యార్థులు మాత్రమే పాఠశాలకు వస్తుండగా ఉపాధ్యాయులు తమ పోస్టింగ్ ఎక్కడ మారుస్తారో అనే భయంతో పిల్లలు లేకున్నా 20నుండి25 మంది ఉన్నట్లుగా హాజరు రిజిస్టర్లలో పేర్లు నమోదు చేసి తప్పుడు లెక్కలు చూపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.మండలంలో ఒకప్పుడు 60 కి పైగా పాఠశాలలుంటే ప్రస్తుతం సగానికి మూత పడిపోయిన దుస్థితి మనకు కనబడుతుంది. మండలంలో 37 ప్రాథమిక పాఠశాలలు,3 ప్రాథమికోన్నత పాఠశాలలు,6ఉన్నత పాఠశాలల తోపాటు టిఎస్ఆర్ఎస్,కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉన్నాయి.ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో మొత్తం 1780 మంది విద్యార్థులు ఉన్నారు. ఉన్నత పాఠశాలలో మొత్తం 2192 మంది విద్యార్థులు ఉన్నారు.మండలంలో మరో 10 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. మండలంలో ఉన్న 37 ప్రాథమిక పాఠశాలల్లో నాగంవారి గూడెం,పుర్లకుంట,గాంధీనగర్ తండా,గంగమూల తండా,రాజన్న బావి,కడపగండి తండా,సభావతి తండా,రాచకొండ పాఠశాలలు విద్యార్థులు లేని కారణంగా మూతపడ్డాయి. ఉపాధ్యాయుల సర్దుబాటు(డిప్యూటేషన్) విషయంలో క్లస్టర్ హెడ్మాస్టరులు, ఎంఈఓలదే ఇస్తారాజ్యమైందని పలువు ఉపాధ్యాయుల ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయుల డిప్యూటేషన్ క్లస్టర్, మండల పరిధిలోని చేయాలని ఉన్నప్పటికీ కొంతమంది ఉపాధ్యాయులను పక్క మండలం చౌటుప్పల్ కు డిప్యూటేషన్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత జిల్లా,రాష్ట్ర స్థాయి అధికారులు జోక్యం చేసుకొని మండలంలో ప్రభుత్వ విద్యను, గిరిజన తండాల పాఠశాలలను మెరుగుపరచాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

.పర్యవేక్షణ కొరత లేదు-ఇన్‌చార్జి ఎంఈఓ నాగవర్ధన్ రెడ్డి

పూర్తిస్థాయి ఎంఈఓ పోస్టింగ్ లేకపోవడంతో ఎంఈఓ తో పాటు కాంప్లెక్స్ హెడ్మాస్టర్లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.కాంప్లెక్స్ హెడ్మాస్టర్లే లీవ్ లేవడం స్కూల్లను సందర్శించడం చేస్తున్నారు. తాను లాంగ్ లీవ్ లు మాత్రమే చూస్తున్నాను.కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు నెలకు రెండు సార్లు స్కూళ్లను తప్పకుండా విజిట్ చేస్తున్నారు. ఉపాధ్యాయులు సరైన సమయం పాలన పాటించడం లేదనే విషయం తన దృష్టికి రాలేదు.గ్రామాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యను బట్టి తండాల్లో ఎన్రోల్మెంట్ అనేది జరుగుతుంది.మండలంలో 12 పాఠశాలలో విద్యార్థులు లేని కారణంగా అక్కడ పనిచేసే ఉపాధ్యాయులను జిల్లా వైద్యాధికారి ఆర్డర్ మేరకే చౌటుప్పల్ మండలానికి డిప్యూటేషన్ చేశాం.

ప్రభుత్వ విద్యను కాపాడాలి

.ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్న ఎంఈఓ,క్లస్టర్ హెడ్మాస్టర్లు,గిరిజన తండాల ఉపాధ్యాయులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.ప్రభుత్వ విద్యను కొంతమంది ఉపాధ్యాయులే నిర్వీర్యం చేస్తున్నారని పేర్కొన్నారు.సమయపాలన పాటించకుండా ఇష్టమా చిన్నట్లు విధులకు హాజరవడం వల్ల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలపై మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్య అందని ద్రాక్షగా మారిపోయే ప్రమాదం ఉందన్నారు.ప్రైవేటు వ్యాపారాలు చేసుకుంటూ ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తున్న ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వినతి పత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు. దంతావోని అమరేందర్,జిల్లా కమిటీ సభ్యులు ఉప్పలపల్లి బాలకృష్ణ,లింగస్వామీ,రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రయివేట్ ప్రసూతి ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని వినతి

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని ప్రయివేట్ ప్రసూతి ఆసుపత్రి కేంద్రాల్లో స్కానింగ్‌ల పేరుతో సామాన్య ప్రజల నుండి ఆర్థిక దోపిడికి పాల్పడుతున్నారని, ఈ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావుకు డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె మధుకృష్ణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేట్ ఆసుపత్రులకు గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన రోగులు, గర్భిణులకు స్కానింగ్‌ల పేరుతో అడ్డూ అదుపు లేకుండా అధిక ఫీజులు వసూలుచేసి ప్రజల నుండి ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వెంటనే జిల్లా వైద్య అధికారి స్పందించి అధికంగా స్కానింగ్ ఫీజులు వసూలుచేస్తున్న ప్రసూతి ప్రయివేట్ ఆసుపత్రులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు యు.బాలకృష్ణ, దొంతగోని అమరేందర్, బత్తుల వేణు, లింగస్వామి, రాజు పాల్గొన్నారు.



యువత స్వశక్తితో ముందుకెళ్లాలి

మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బత్తుల శ్రీశైలం

నవతెలంగాణ-చౌటుప్పల్

యువత స్వశక్తితో ముందుకు వెళ్లాలని చౌటుప్పల్ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బత్తుల శ్రీశైలం తెలిపారు. సోమవారం మున్సిపాలిటీలోని బస్టాండ్ ఆవరణలో గల చౌటుప్పల్ షాపింగ్ కాంప్లెక్సులోని షాప్ నెంబర్ 213లో నూతనంగా ఏర్పాటుచేసిన మెడికేర్ డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మస్థైర్యం పెంపొందించుకుంటూ వ్యాపార రంగంలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపగోని లక్ష్మణ్, కౌన్సిలర్ కొయ్యడ సైదులుగౌడ్, సీపీఐ(ఎం) మున్సిపల్ కార్యదర్శి బండారు నర్సింహా, నాయకులు దండ అరుణ్‌కుమార్, పల్లం సత్యం, గోశిక కరుణాకర్, గ్యార కిష్టయ్య, నిర్వాహకులు గుణమోని అయిలయ్య, డైరెక్టర్లు వెంకటరమణ, బాలరాజు, రాజు, వీరయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రవాస్ యోజన అవగాహన సదస్సు

నవతెలంగాణ -ఆలేరు టౌన్

ఆలేరు పట్టణ కేంద్రంలోని ఏ.యస్.ఆర్ గార్డెన్ లో ఎమ్మెల్యే ప్రవాస్ యోజన సదస్సు , శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ లు,బూత్ అధ్యక్షులు విస్తృత స్థాయి సమావేశంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యే డాక్టర్ శ్రీ చంద్రు లమాని గతో కలిసి బీజేపీరాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుదగాని హరిశంకర్ గౌడ్ సదస్ హాజరై ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో బి.జె.పి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల శ్రీనివాస్ , వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్ , చెరిగ శ్రీనివాస్, జాహంగీర్, రాఘవేంద్ర , లక్ష్మీ, తోట మల్లయ్య , మహేష్, వెంకటేష్ భాస్కర్ గౌడ్ , రాజు , అయిలి సందీప్ గౌడ్, వడ్డెమాను కిషన్, జూల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంపొందించేందుకే ఉన్నతి

డీఈవో నారాయణరెడ్డి

నవతెలంగాణ -భువనగిరిరూరల్



ప్రస్తుత విద్యా పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల్లో సామర్థ్యాలు, అభ్యసనా ఫలితాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుంచి ఉన్నతి అనేకార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని డీఈవో నారాయణరెడ్డి అన్నారు. సోమవారం అనంతారం పరిధిలోని వెన్నెల కళాశాలలో 6 నుంచి 9 తరగతుల విద్యార్థుల కోసం దీనిని రూపొందించగా, ఈ మూడు రోజుల ప్రధానోపాధ్యాయుల మొదటి విడత శిక్షణా కార్యక్రమాన్ని డీఈఓ ప్రారంభించి, మాట్లాడారు. ఈ కార్యక్రమ ఆవశ్యకత, లక్ష్యాలు, విధివిధానాలు,వాచకాలు, బోధనా ప్రణాళికలు అంశాలపైపూర్తి అవగాహన కోసం ప్రధానోపాధ్యాయులు,ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు . ఈ విద్యా సంవత్సరం నుండి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, రెసిడెన్షియల్ , మోడల్, కేజీబివి పాఠశాలల్లో గణనీయమైన ప్రగతిని సాధించుటకు అందరూ కలిసి కృషి చేయాలని కోరారు. జిల్లాలో 163 ప్రభుత్వ ఉన్నత, 7 మోడల్ ,11, కే జి బి వి , 68 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ ఉన్నతి కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్టు తెలిపారు.

బ్రిడ్జి మరమ్మత్తు పనులు చేపట్టాలని వినతి

నవతెలంగాణ-గుండాల

గుండాల,నూనెగూడెం గ్రామాల మధ్య ఉన్న వాగుపై గండి పడిన బ్రిడ్జికి మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని కోరారు.సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా జాయింట్ కలెక్టర్ కు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండాల మండలంలో 2023 జూలై 18 నుండి 28 వ తేదీ వరకు పదిరోజులు కురిసిన భారీ వర్షాలు వరదల వల్ల గుండాల నూనెగూడెం గ్రామాల మధ్య వాగుపై ఉన్న బ్రిడ్జి కోతకు గురై గండిపడిందని,నెలరోజులుగా స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు బ్రిడ్జికి మరమ్మతులు పనులు చేయడం లేదని ఆరోపించారు.బ్రిడ్జి మీదుగా ప్రయాణించే వాహనదారులు ప్రమాదపు అంచుల్లో ప్రయాణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు పోతరబోయిన సత్యనారాయణ,ఎండి ఖలీల్,బాలయ్య,భిక్షం,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-చౌటుప్పల్



రాబోయే శాసనసభ ఎన్నికల్లో మునుగోడు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి సీఎం కేసీఆర్ టిక్కెట్ కేటాయించడంతో సోమవారం పట్టణకేంద్రంలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీచేశారు. కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ ఎమ్‌డి.బాబాషరీఫ్, మాజీ మార్కెట్ ఛైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బొడిగె ఆనంద్‌గౌడ్, భీమిడి రాంరెడ్డి, ఉడుగు శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్, తాడూరి పరమేశ్, వస్తం గంగరాములు, ముప్పిడి శ్రీనివాస్‌గౌడ్, ఎంఎస్.గౌడ్, ఎమ్‌డి.ఖలీల్, పోలోజు శ్రీనివాస్‌చారి, తొర్పునూరి పరమేశ్, ఎమ్‌డి.చోటేబాయి, బాలగోని గణేశ్, రమణగోని రఘు పాల్గొన్నారు.

ఆలేరు టౌన్ : ఆలేరు అసెంబ్లీ అభ్యర్థిగా మూడోసారి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, గొంగిడి సునీత ని ముఖ్యమంత్రి కేసీఆర్ కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ,సోమవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో బీఆర్ ఎస్ పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బాణసంచా కాల్చి, బస్టాండ్ నుండి పాలకేంద్ర వరకు నినాదాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్మన్ వస్పరి శంకరయ్య ,వైస్ చైర్మన్, మురిగాడి మాధవి వెంకటేష్, ఆర్టిఏ సభ్యులు పంతం కృష్ణ, మార్కెట్ డైరెక్టర్, వెంకటేష్, చింతకింది.మురళి, డాక్టర్, చింతకింది. మురహరి, మోర్తాల. రమణారెడ్డి, జూకంటి ఉప్పలయ్య, దయ్యాల. సంపత్, బి. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

జిల్లా అదరపు కలెక్టర్లు

నవ తెలంగాణ భువనగిరి రూరల్



ప్రజల నుంచి అందిన ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్లు జి వీరారెడ్డి, భాస్కర్ రావులు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేటు సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి ఫిర్యాదుల స్వీకరణ లో ప్రజల నుండి 23 ఫిర్యాదులను స్వీకరించారు.ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు ఆదేశించారు. కాగా బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఎంపికైన విద్యార్థుల నుంచి యాదగిరిగుట్టలో పాఠశాల వారు డబ్బులు అడుగుతున్నారని గుండాల మండలానికి చెందిన వెంకటేష్ సురేష్ లు వినతిపత్రం అందజేశారు. చీమల కొండూరు గ్రామానికి చెందిన ఒకరు ఆగిపోయిన పెన్షన్ గురించి, మరొకరు వికలాంగుల పెన్షన్ను మార్చాలని కోరారు కోరారు. రెవెన్యూ శాఖ 20, గిరిజన సంక్షేమం, ఎస్సీ కార్పొరేషన్, విద్యాశాఖ ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి పద్మజారాణి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కంపెనీ యాజమాన్యంను విచారించిన డీఎల్పీఓ, ఎంపీఓ

నవతెలంగాణ -యాదగిరిగుట్ట రూరల్



యాదగిరిగుట్ట మండలంలోని పెద్ద కందుకూరు గ్రామంలో సోమవారం ప్రీమియర్ ఎక్స్‌క్లూజీవ్ కంపెనీ యాజమాన్యంను పిలిచి టాక్స్ ఎందుకు కట్టడం లేదని డీఎల్‌పీఓ కొమ్మగల యాదగిరి,ఎంపీవో ఎం.దినకర్, పంచాయతీ సెక్రెటరీ పి.కవిత విచారించారు. టాక్స్ ఎందుకు కట్టడం లేదని వివరాలు కంపెనీ తగిన సమాచారం రాసి ఇచ్చారని తెలిపారు. మహేందర్ గుండ్లపల్లి కృష్ణ వార్డు సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద కందుకూరు గ్రామపంచాయతీలో గతంలో యాదాద్రి భువనగిరి కలెక్టర్ కి టాక్స్ కట్టడం లేదు అని ఫిర్యాదు చేశామన్నారు. తాము కంపెనీ ఓపెన్ ల్యాండ్ కు కూడా టాక్స్ కట్టాలని ఫిర్యాదు చేశామన్నారు.

3న మార్కెట్ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ -వలిగొండ రూరల్

వలిగొండ- రామన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా వలిగొండ మండలానికి చెందిన తెలంగాణ ఉద్యమ నేత పైళ్ల రాజా వర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా కంభంపాటి శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం దోనూరు ప్రతాపరెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి,ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిలు హాజరవుతారని ,బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్ రాజ్, పిఎసిఎస్ చైర్మన్ సుర్కంటి వెంకట్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ కొమురెల్లి సంజీవరెడ్డి రైతు సమన్వయ మండల కోఆర్డినేటర్ పడమటి మమత, చిట్టెటి జనార్దన్ రెడ్డి, గూడూరు శివశాంత్ రెడ్డి, కీసర్ల సత్తిరెడ్డి, దేగల పాండరి,ముద్దసాని కిరణ్ రెడ్డి, బోళ్ల శ్రీనివాస్, కుందారపు కొమురయ్య, పల్లెర్ల రాజు,ఎమ్మె లింగస్వామి, ధనంజయ్య, పోలేపాక సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల పంచమి

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో సోమవారం నాగుల పంచమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పుట్టలో పాలుపోసి, పసుపు కుంకుమ చల్లి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ కామిశెట్టి శైలజభాస్కర్, కాసోజు సుజాత, శ్రీలక్ష్మీ, పావని, కావ్య పాల్గొన్నారు.

జిల్లా సాధనకై ప్రత్యేక ప్రార్థనలు

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

మిర్యాలగూడ జిల్లా సాధనకై తెలంగాణ మెన్ అండ్ ఉమెన్స్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మిర్యాలగూడలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని అర్హతలు ఉన్న మిర్యాలగూడను జిల్లా చేయాలని ఏసుక్రీస్తును ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హన్యానాయక్, రమాబాయి, జనార్ధన్, జోసెఫ్, రాజు, సుధాకర్, దేవదానం, సూర్యనాయక్, సామ్యూల్, అబ్రహం, అశోక్, హర్యా, వెంకటరావు, మోతిలాల్, లచ్చిరాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మిర్యాలగూడరూరల్

కోకాపేటలో పెరిక కుల సంఘం ఆత్మీయ భవన నిర్మాణ శంకుస్థాపన పోస్టర్ను సోమవారం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు మిర్యాలగూడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిక కులస్తులకు మిర్యాలగూడ పట్టణంలో భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తానన్నారు. పెరిక కులస్తుల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆత్మీయ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ ఘటిక విజయకుమార్, సూర్యాపేట మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, నాయకులు నాగార్జున, ముత్తినేని శ్యాంసుందర్, కోట శ్రీనివాసరావు, వీరభద్రయ్య, గణేష్, పరుశురాములు, నాగయ్య, వెంకటేశ్వర్లు, వీరయ్య, ఉపేందర్, శ్రీను, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు పాదాభివందనాలు

నవ తెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న తనకు మరోసారి టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్ కు స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాదాభివందనాలు తెలిపారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి తన ఎమ్మెల్యే పదవిని సీఎం కేసీఆర్ కు బహుమతిగా ఇస్తానన్నారు. టిఆర్ఎస్ నకరికల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్ కు, మంత్రులు కేటీఆర్ కు, హరీష్ రావుకు, జగదీశ్ రెడ్డి లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తెలియజేయాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

అంగన్వాడీలకు అధిక వేతనం ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ

నవతెలంగాణ-నకిరేకల్

అంగన్వాడీలకు అధిక వేతనాన్ని ఇస్తున్న రాష్ట్రం మన తెలంగాణ ఒక్కటేనని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ క్యాంపు కార్యాలయంలో సోమవారం అంగన్వాడీ టీచర్లకు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఎన్ హెచ్ టి ఎస్ పోషణ ట్రాక్టర్ యాప్ ట్రైనింగ్ ప్రీ స్కూల్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్ల వేతనం రూ. 4200 నుండి 13,650కు పెంచిందన్నారు. అంగన్వాడి హెల్పర్ల వేతనం రూ. 2200 నుండి 7800 వేతనం పెంచిందన్నారు. ఆశ వర్కర్ల వేతనం రూ. 7500 నుండి 9750కు పెంచిందన్నారు. అనంతరం అంగన్వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్, జెడ్పిటిసి మాదనలక్ష్మి నగేష్ గౌడ్, ఐసిడిఎస్ సిడిపిఓ అస్రా అంజుమ్, సూపర్వైజర్లు సునీత, జ్యోతి, కళావతి, శారద, అంజమ్మ, పద్మావతి, భవాని, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

24న స్పాట్ కౌన్సెలింగ్

నవతెలంగాణ-మిర్యాలగూడరూరల్

ఈ నెల 24 నాడు అవంతిపురం గిరిజన గురుకుల బాలుర కళాశాలలో బైపీసీ గ్రూప్‌లో ఉన్న 14 ఖాళీలకు, సీఈఓ గ్రూప్‌లో ఉన్న 14 ఖాళీల భర్తీకి గిరిజన బాలుర విద్యార్థులను స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ కోడుమూరి సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్, మూడు సెట్ల జిరాక్స్, నాలుగు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని ఆగష్టు 24 నాడు ఉదయం 11 గంటలకు మిర్యాలగూడ మండలం అవంతిపురం గిరిజన గురుకుల బాలుర పాఠశాల, కళాశాల లో హాజరు కావాలని వారు తెలిపారు. 2023 మార్చ్ లో ఉతిర్ణత సాధించి ఉండాలని. బైపీసీకు 8 జీపీ కన్నా ఎక్కువ, సీఈసీకు 7 జీపీ కన్నా ఎక్కువ ఉన్న గిరిజన విద్యార్థులు మాత్రమే హాజరు కావాలని కోరారు.

'యాదగిరి కుటుంబానికి అండగా ఉంటాం'

నవతెలంగాణ-మునుగోడు

మునుగోడు మండల కేంద్రానికి చెందిన ముచ్చపోతుల యాదగిరి గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సోమవారం కల్లుగీత కార్పొరేషన్ చైర్మెన్ పల్లె రవికుమార్ యాదగిరి కుటుంబ సభ్యులను పరామర్శించి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పల్లె రవి మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోయిన యాదగిరి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి ముచ్చపోతుల శ్రీనివాస్ ఉజ్వల రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు నాగరాజుగౌడ్, పెరమండ్ల యాదగిరి, పెరమండ్ల ప్రతాప్, నీరుడు సైదులు, గాలి మాలాద్రి, సాయి చందు తదితరులు పాల్గొన్నారు.

ఊ అంటారా.. ఊహూ అంటారా..?

- **టికెట్ల ప్రకటనపై రెబెల్స్ మౌనం..**
- **ఇప్పటికే రూ.కోట్లలో వ్యయం..**
- **అంతర్మథనంలో ఆశావాహులు**

నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్ అధిష్టానం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల టికెట్లకు సంబంధించి అభ్యర్థులను ప్రకటించింది. అయితే ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో టికెట్ ఆశించి.. తమకే పార్టీ అధిష్టానం కేటాయింస్తుందనే ఉద్దేశంతో రూ.కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా పనిచేశారు. కానీ తాజాగా అభ్యర్థుల ప్రకటనతో రెబెల్స్‌లో తీవ్ర గందరగోళం నెలకొంది. భవిష్యత్తు కోసం ఏ నిర్ణయం తీసుకోవాలి..? పార్టీలో ఉండాలా..? జంప్ చేయాలా..? ఇన్నాళ్లూ తనను నమ్ముకుని వెంట నడిచిన క్యాడర్‌కు ఏం సమాధానం చెప్పాలో తెలియక అంతర్మథనంలో పడిపోయారు. పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని ఊ అనాలా..? ఊహు అనాలా..? అన్న సందిగ్ధంలో పడిపోయారు.

ఈ నియోజకవర్గాలోనే ఎక్కువ..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సగానికి పైగా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌లో గ్రూప్ వార్ నెలకొంది.ఇందులో ప్రధానంగా నల్లగొండ, మునుగోడు, నకిరేకల్, నాగార్జునసాగర్, కోదాడ నియోజకవర్గాల్లో ఈ రెబెల్స్ బెడద తారాస్థాయిలో ఉంది. అయితే వారంతా ఇప్పుడు ఏం నిర్ణయం తీసుకోబోతున్నారనేది చర్చనీయాంశమవుతుంది. నల్లగొండ నియోజకవర్గం విషయానికొస్తే.. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డికి వ్యతిరేకంగా పిల్లి రామరాజుయాదవ్, చాడ కిషన్ రెడ్డి, గుత్తా అమిత్ రెడ్డి తదితరులు టికెట్‌ను ఆశించి భారీగానే ఖర్చు చేశారని తెలుస్తోంది. నకిరేకల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, కోదాడలో కన్మంతరెడ్డి శశిధర్ రెడ్డి, నాగార్జునసాగర్‌లో ఎంసీ కోటిరెడ్డి, కట్టెబోయిన అనిల్ కుమార్ యాదవ్, రంజిత్, పాండురంగారెడ్డిలు టికెట్ ఆశించి.. సామాజిక కార్యక్రమాలు భారీగా చేపట్టారు. ఇక మునుగోడు విషయానికొస్తే.. కర్నాటి విద్యాసాగర్, నారబోయిన రవి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులు టికెట్ కోసం విశ్వప్రయత్నాలు చేశారు.



భవిష్యత్తు నిర్ణయంపై సస్పెన్స్..

అధికార పార్టీలోనే ఉంటూ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా పనిచేసిన లీడర్లంతా తమ భవిష్యత్తు ఏంటనే దానిపై డోలాయమానంలో పడిపోయారు. ఇన్నాళ్లూ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పనిచేసి.. ఇప్పుడు కలిసిపోవడం సాధ్యమవుతుందా..? లేక వేరు కుంపటి పెడితే ఏలా ఉంటుందనే అంశాలపై ఇప్పటికే సన్నిహితులతో మంతనాలు చేస్తున్నట్టు సమాచారం. ఒకవేళ పార్టీ అధిష్టానం జోక్యం చేసుకుని.. బుజ్జగించే ప్రయత్నం చేస్తుందా..? లేక తమను ఒంటరిగానే వదిలేస్తారా..? అలా చేస్తే ఏం చేయాలనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. నిజంగానే రెబెల్స్ పార్టీని వీడితే.. ఎన్నికల్లో ఏ మేరకు ఆ ప్రభావం పడుతుంది..? దాన్ని ఏలా భర్తీ చేస్తారోనన్న చర్చ లేకపోలేదు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

- **సమయపాలన పాటించని అధికారులపై ఎంపీపీ ఆగ్రహం**



- **విద్యాశాఖ పనితీరుపై ప్రజాప్రతినిధుల అసహనం**

నవతెలంగాణ-నాంపల్లి

నాంపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేత రవీందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభం అయ్యే సమయానికి ప్రజాప్రతినిధులు వచ్చినప్పటికీ మండల స్థాయి అధికారులు మాత్రం కేవలం ఇద్దరు మాత్రమే వచ్చారు. సమావేశం ప్రారంభం అయిన తర్వాత మిగతా శాఖల అధికారులు ఒక్కొక్కరుగా మెల్లగా సమావేశానికి హాజరయ్యారు. అధికారులను ఉద్దేశించి ఎంపీపీ మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి కూడా సమయానికి రాకుండా నిర్లక్ష్యం చేస్తున్నారంటే విధులు ఏ విధంగా చేస్తున్నారో అర్థం అవుతుంది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవలసి ఉంటుందని హెచ్చరించారు. మహమ్మదాపురం సర్పంచ్ మలిగిరెడ్డి చంద్రారెడ్డి మాట్లాడుతూ బీసీ బందు పథకం లబ్ధిదారులను నిజమైన అర్హులకు కాకుండా అనర్హులకు, హైదరాబాదులో నివాసం ఉంటున్న వారికి ఇచ్చారన్నారు. మహమ్మదాపురం గ్రామంలో గత ప్రభుత్వం నిరుపేదలకు గృహ నిర్మాణాల కోసం కొనుగోలు చేసిన భూమిని గ్రామములో కొంతమంది ఆక్రమించారని ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నివాస స్థలం లేని వారికి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచిగా ఎన్నికైనప్పటినుండి టాయిలెట్స్ సమస్యను ప్రతి సర్వసభ్య సమావేశంలో సభ దృష్టికి తీసుకువచ్చిన తన పదవీకాలం ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్న ప్రభుత్వం టాయిలెట్స్‌కు నిధులు కేటాయించి నిర్మాణం చేయకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. టిపి గౌరారం సర్పంచ్ కొమ్ము యాదమ్మ మాట్లాడుతూ ఉపఎన్నికల సందర్భంగా వడ్డేపల్లి నుండి చింతపల్లి వరకు రోడ్డు నిర్మాణం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని ఆ హామీ మేరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. మల్లపురాజుపల్లి సర్పంచ్ మునగాల సుధాకర్‌రెడ్డితో పాటుగా పలువురు సర్పంచులు మండల విద్యాశాఖ అధికారుల పనితీరుపై సహనం వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 3045 మంది మాత్రమే ఉండడం ఏమిటని విద్యార్థుల సంఖ్య క్రమంగా ఎందుకు తగ్గుతుందని మండల విద్యాధికారిని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడంలో విద్యాశాఖ అధికారులు విఫలం చెందారని తెలిపారు. కొంతమంది ఉపాధ్యాయులు అధికారులతో సమావేశాలకు, ఆన్‌లైన్ సమావేశాలకు హాజరుకావడానికి మాత్రమే ఉద్యోగం చేస్తున్నారని విద్యార్థులకు పాఠాలు చెప్పడం లేదని సర్పంచులు అన్నారు. గృహలక్ష్మి, బీసీ బంధు పథకాలలో అర్హులైన వారిని ఎంపిక చేయాలని పలువురు సర్పంచులు సభ దృష్టికి తీసుకువచ్చారు. గృహలక్ష్మి పథకం అనేది నిరంతర ప్రక్రియ అని ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా నిజమైన అర్హులైన వారినే ఎంపిక చేస్తున్నట్టు ఎంపీపీ తెలిపారు. వడ్డేపల్లి నుండి తుంగ పహాడ్ వరకు బీటీ రోడ్డు రెన్యువల్ మంజూరైందని, టెండర్ కూడా అయిపోయిందని ఇప్పటికే పనులు మొదలు పెట్టాల్సి ఉండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పని ఆలస్యం అవుతుందని, ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. మండలంలోని పాఠశాలలలో నెలకొన్న టాయిలెట్స్, వంట గదులు ఇతర సమస్యలను గుర్తించి నివేదిక ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారిని ఎంపీపీ ఆదేశించారు. అధికారులు సమయపాలన పాటిస్తూ సమన్వయంతో పనిచేయాలని ఎప్పటికప్పుడు తమ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను మండల పరిషత్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే.శేషు కుమార్, తహసిల్దార్ జి.దేవా సింగ్, మండల విద్యాధికారి ఈ.గుర్వారావు, ఏఈలు రామచంద్రయ్య, సతీష్‌రెడ్డి, అభిషేక్, మహమ్మద్, ప్రభుత్వ వైద్యులు సయ్యద్ ఇక్బాల్, ఎంపీటీసీలు అన్నెపాక సరిత, రామావత్ బుజ్జి, దాసరి సాలమ్మ, బెక్కం రమేష్, బత్తుల వంశీ, రమావత్ సుజాత, సర్పంచులు నాగులవంచ శ్రీలత, కోరే హేమలత, జల్లల యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

25న రౌండ్‌టేబుల్ సమావేశం

నవతెలంగాణ-తిరుమలగిరి

శ్రీరామ్ సాగర్ రెండవ దశ కాలువకు తెలంగాణ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎంపీ భీమిరెడ్డి నర్సింహారెడ్డి పేరు నామకరణం చేయాలని ఆగస్టు 25న ప్రగతి నగర్ తిరుమలగిరి వద్ద ఈనెల 25న రౌండ్ టేబుల్ సమావేశం జయప్రదం చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న, వసుకుల మట్టయ్య పిలుపునిచ్చారు.సోమవారం సమావేశానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, నల్లగొండ జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు మస్కుల గోపి, తుంగతుర్తి డివిజన్ నాయకులు ఈదూరి వీర పాపయ్య, నలుగురి రమేష్, ఏశబోయిన సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మాధవరం మనోహర్‌రావు మృతి బాధాకరం

నవతెలంగాణ-డిండి

డిండి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన మాధవరం మనోహర్‌రావు మృతి బాధాకరమని దేవరకొండ శాసన సభ్యులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం మనోహర్‌రావు మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మనోహర్‌రావు ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయన వెంట రైతు బంధు అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర్‌రావు, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, పీఏసీఎస్ చైర్మెన్ మాధవరం శ్రీనివాస్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ పేర్వాల జంగారెడ్డి, మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, జహంగీర్, భగవంతురావు, నరేందర్‌రావు, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం తహసీల్దార్‌గా గాజులు ప్రమీల

నవతెలంగాణ-త్రిపురారం

రాష్ట్ర వ్యాప్తంగా తాహసీల్దార్ బదిలీలల్లో భాగంగా త్రిపురారంలో పని చేస్తున్న జయశ్రీ అనుములకు వెళ్లగా నారాయణపేటలో పనిచేస్తున్న గాజుల ప్రమీల త్రిపురారం తాహసీల్దార్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం రెవెన్యూ సిబ్బందిని పరిచయం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం నిత్యం అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు. పలు పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీటీ సైదులు, జూనియర్ అసిస్టెంట్ నరసింహ, ఆర్ఐలు జాన్సి, సైదులు, ధరణి, ఆపరేటర్ సతీష్, రాజేష్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు

నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల: నూతనంగా విచ్చేసిన తహశీల్దార్ గుగులోతు దశరథను బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు తుమ్మల నాగరాజురెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆ విభాగం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మండలంలోని యువకులు "ఓటర్ హెల్ప్" అనే యాప్ ను డౌన్లోడ్ చేసుకొని మీ ఓటర్ కార్డుని సరి చూసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చిత్రగంటి ప్రవీణ్, శ్రీకాంత్, భరత్, వంశీ పాల్గొన్నారు.

బుద్ధవనం అద్భుత బౌద్ధ ప్రపంచం

● శ్రీలంక కళాకారులు

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన బుద్ధవనం ఒక అద్భుతమైన బౌద్ధ ప్రపంచమని శ్రీలంక కళాకారులు గామిని జయ సంగే, అమితాబ్ ఉదయ్ లు తెలిపారని బౌద్ధ విషయ నిపుణులు చరిత్రకారులు బుద్ధ వనం కన్సల్టెంట్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ఆహ్వానం మేరకు శ్రీలంకకు చెందిన కళాకారులు సోమవారం బుద్ధవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బుద్ధ వనం కన్సల్టెంట్ ఈమని శివనాగిరెడ్డి శ్రీలంక కళాకారులకు బుద్ధ చరిత వనం ,జాతకవనం, స్తూపవనం, ధ్యాన వనముల గురించి వివరించారు. ధ్యాన వనంలోని 27 అడుగుల శ్రీలంక అవకన బుద్ధుని విగ్రహాన్ని, స్థూపా వనంలోని శ్రీలంక అనురాధపూర్‌లోని స్తూప నమూనాని చూసి శ్రీలంక దేశ కళాకారులు పులకించిపోయారని ఆయన తెలిపారు. బౌద్ధ వారసత్వ సంపదను 2700 సంవత్సరాల క్రితం నాటి బౌద్ధ శిల్ప సంపదను కనులకు కట్టినట్లుగా నాగార్జునసాగర్ బుద్ధ వనం లో నిర్మించిన తెలంగాణ ప్రభుత్వాన్ని, బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య ను వారు అభినందించినట్లుగా తెలిపారు. వీరితోపాటు బుద్ధవనం డిజైన్ ఇన్‌ఛార్జి శ్యాంసుందర్రావు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

చింతపల్లి : చింతపల్లి మండలంలోని గొల్లపల్లి సమైక్య నగర్ గ్రామానికి చెందిన జంగయ్య(42) గత నెల రోజుల క్రితం మరణించారు. ఆయన కుటుంబానికి సోమవారం సమైక్య నగర్ గొల్లపల్లి గ్రామానికి చెందిన యువకులు మహిళలు ఆసరాగా నిలిచారు. చనిపోయిన వ్యక్తి కుటుంబంలో భార్య భాగ్యమ్మ ఇద్దరు చిన్న కుమారులు ఉన్నారు. ఈ కుటుంబం ప్రతిరోజు కూలి పని చేసుకుంటూ మేస్త్రి పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. అకస్మాత్తుగా తన భర్త రోడ్డు యాక్సిడెంట్ లో చనిపోవడం కుటుంబానికి పెద్దదిక్కు కోల్పోయామని, కుటుంబ పోషణ భారంగా ఉందని ఆ గ్రామంలోని యువకులు మహిళలు సైతం ముందుకొచ్చి దాదాపు 60 మంది మొత్తం 48,110 రూపాయలను విరాళంగా కుటుంబానికి అందజేశారు. జడ్పీటీసి కంకణాల ప్రవీణ వెంకటరెడ్డి 10,000, మాజీ జెడ్పిటిసి నాయక్ 5,000 సైతం వారి కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సాయం అందజేశారు. వరికుప్పల శివ, జంగయ్య, నరేష్, రమేష్ కుమార్ ,మహేష్, సురేష్, శ్రీను ,శివ మరియు మహిళలు తదితరులు ఉన్నారు.

12 ఎమ్మెల్యే స్థానాలు గెలుస్తాం

నవతెలంగాణ-చిట్యాలటౌన్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నాయకత్వంలో 12 ఎమ్మెల్యే స్థానాలు గెలుస్తామని తెలంగాణ ఉద్యమకారుడు బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నేత కూనూరు సంజయ్ దాస్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. మంత్రి జగదీశ్ రెడ్డి నాయకత్వంలో ఉమ్మడి జిల్లాలోని 12 మంది ఎమ్మెల్యేలు ప్రజల సంక్షేమం కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డారని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 12 మంది ఎమ్మెల్యేలను మరొకసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల హర్షం

నవతెలంగాణ-నాగారం

తుంగతుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడవసారి గాదరి కిషోర్‌కుమార్‌ను సీఎం కేసీఆర్ ప్రకటించడంపై బీఆర్‌ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు కల్లెట్లపల్లి ఉప్పలయ్య ఆధ్వర్యంలో పటాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.హర్షం వ్యక్తం చేసిన వారిలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు గుండగాని అంబయ్య, ఎర్రయాదగిరి, మండల అధికారప్రతినిధి చిల్లర చంద్రమౌళి, మండల నాయకులు దోమల బాలమల్లు,తరాల ఆంజనేయులు, తరాల యాద గిరి, మల్యాల అశోక్, ఈదుల కిరణ్ పాల్గొన్నారు.

తుంగతుర్తి: బీఆర్‌ఎస్ తుంగతుర్తి



నూతనకల్‌లో..

నియోజకవర్గ అభ్యర్థిగా గాదరి కిశోర్‌కుమార్ పేరును సీఎం కేసీఆర్ ప్రకటించడం పట్ల ఆ పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, జిల్లా నాయకులు రాములు గౌడ్, దొంగరి శ్రీనివాస్ ,కటకం వెంకటేశ్వర్లు ,చెరుకు పరమేష్, గోపగాని శ్రీనివాస్ ,గోపగాని రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట: మూడవసారి సూర్యాపేట నుండి మంత్రి జగదీశ్‌రెడ్డిని ముఖ్యమంత్రి కేసీఆర్ అభ్యర్థిగా ప్రకటించడ ంతో సూర్యాపేట నియోజకవర్గ వ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి.తమకు అభివృద్ధిని పరిచయం చేసిన జగదీశ్‌రెడ్డి మూడోసారి పోటీ చేస్తున్నారని విషయం తెలిసిన వెంటనే బీఆర్‌ఎస్ కార్యకర్తలు,మహిళలు, నాయకులు సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుతూ, బాణా సంచా కాలుస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళ నాయకులు డ్యాన్సులు చేస్తూ మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. సూర్యాపేట పట్టణంలోని తెలంగాణ తల్లి బొమ్మ వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహి ంచారు. సూర్యాపేటలో శాంతి భద్రతలు నెలకొల్పి, సూర్యాపేటను ప్రపంచసాయి పట్టణంగా తీర్చిదిద్దుతున్న జగదీశ్ అన్నను మూడోసారి గెలిపించుకుంటామని వాగ్దానం చేశారు.

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రం తెలంగాణ చౌరస్తాలో మూడోసారి గాదరికిశోర్‌కుమార్‌కు టికెట్ రావడం పట్ల బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంకేపల్లి రఘునందన్‌రెడ్డి, జిల్లా నాయకులు దూపటి రవీందర్,మార్కెట్ డైరెక్టర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కందుకూరుబాబు, 14వ వార్డుఇన్‌చార్జి మహేశ్వరం సందీప్‌నేత, యూత్ అధ్యక్షుడునాని, గోపాలదాస్ రమేష్, వీరేష్,నరేష్,బెట్టం రాజు,సోమయ్య,నవీన్, పరుశరామ్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం స్థానానికి రెండవసారి ప్రస్తుత ఎమ్మెల్యేగా శానంపూడి సైదిరెడ్డికి బీఆర్‌ఎస్ టికెట్‌రావడం పట్ల స్థానిక ఇందిరా సెంటర్‌లో ఆ పార్టీ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ



హుజూర్‌నగర్‌లో...

పట్టణ అధ్యక్ష కార్యదర్శులు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, బెల్లంకొండ అమర్, అట్లూరి హరిబాబు, దొంతిరెడ్డి పద్మ, కౌన్సిలర్ గుండా పనికుమారి పాల్గొన్నారు.

నూతనకల్: గాదరికిశోర్‌కుమార్‌కు ఎమ్మెల్యే టికెట్ రావడం పట్ల మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు.ఈకార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మున్న మల్లయ్యయాదవ్,,పీఏసీఎస్ చైర్మెన్ కనకటి వెంకన్న, సర్పంచులఫోరం మండల అధ్యక్షుడు చూడి లింగారెడ్డి,బీఆర్‌ఎస్ మండల ప్రధానకార్యదర్శి బత్తుల సాయిల్‌గౌడ్, సీనియర్ నాయకులు భూరెడ్డి సంజీవరెడ్డి, బత్తినిలింగయ్య, బద్దంవెంకట్‌రెడ్డి, ,సుర్కంటి చంద్రారెడ్డి, అనంతుల వెంకన్న, మట్టపల్లి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల: గాదరికిశోర్‌కుమార్‌కు ఎమ్మెల్యే టికెట్ రావడం పట్ల మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్,సర్పంచుల ఫోరం మండలఅధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, ,వైస్ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ దుగ్యాల రవీందర్‌రావు, మండల నాయకులు గుడ్ల వెంకన్న పాల్గొన్నారు.



పద్మశాలీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే రవీంద్రకుమార్

నవతెలంగాణ-చింతపల్లి

పద్మశాలిలా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ శాసన సభ్యులు, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించిన పద్మశాలి మార్కండేయ కమ్యూనిటి హాల్ భవనంను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలిలకు అండగా ఉంటానని ఆయన తెలిపారు. పని చేసే ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ చింతపల్లి జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, మండల అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షులు ఉజ్జిని విద్య సాగర్‌రావు, స్థానిక సర్పంచ్ కొండూరు శ్రీదేవి శ్రీనివాస్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గుడ్డిని శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు తహసీల్దార్‌గా నరేందర్

నవతెలంగాణ-మునుగోడు

మునుగోడు మండల తాసిల్దారుగా ఎం.నరేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి తహసీల్దారుగా విధులు నిర్వహించిన డిప్యూటీ తహసీల్దార్ నేలపట్ల నరేష్ నూతన తహసీల్దార్‌కి అప్ప చెప్పారు. ఈ సందర్భంగా తాసిల్దార్ నరేందర్ మాట్లా డుతూ విధి నిర్వహణలో రెవెన్యూ అధికారులు బాధ్యతా యుతంగా పని చేయాలని సూచించారు. మండలంలో నెలకొన్న రెవిన్యూ సమస్యల పరిష్కారానికి రైతులకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.



రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయండి

● సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

ఆరు రోజులుగా 2వ ఏఎన్ఎం లు సమ్మె చేస్తున్న ప్రభుత్వం ఏఎన్ఎంల పట్ల వివక్ష చూపటం అన్యాయమని సీపీఐ జిల్లా కార్యదర్శి నెళ్లికంటి సత్యం ఆరోపించారు. సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రెండోవ ఏఎన్ఎంలు నిర్వహిస్తున్న సమ్మెలో సత్యం పాల్గొని మాట్లాడారు. రెండవ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి బరిగల వెంకటేష్, రెండవ ఏఎన్ఎంల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రత్నకుమారి, జిల్లా కార్యదర్శి నర్సమ్మ, పద్మ, నాగమణి, వసంత, సుశీల, గీతారాని, భూదేవి, లత, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.



గౌడ సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-చింతపల్లి

గౌడసంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ శాసన సభ్యులు, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామంలో రూ.10లక్షలతో నిర్మిస్తున్న గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తు వారికి అండగా ఉంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మెన్, చింతపల్లి జడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షులు ఉజ్జిని విద్య సాగర్‌రావు, స్థానిక సర్పంచ్ కొండూరు శ్రీదేవి శ్రీనివాస్, సర్పంచుల పోరం అధ్యక్షులు గునెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.